RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 242 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం, మార్చి,22, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 242 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday, March,22, 2026 | PAGES : 8 RS : 4 /- |




## గ్యాస్ సంక్షోభం నుంచి ఊరట...

## రాష్ట్రాలకు అదనపు కేటాయింపులు

### కేంద్రం కీలక నిర్ణయం..!



**హైదరాబాద్,మార్చి,21,తెలంగాణ దిశ :** అమెరికా, ఇజ్రాయెల్ ‌ఇరాన్ యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దేశంలో గ్యాస్ కొరత నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలక ముందడుగు వేసింది. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో గ్యాస్ కేటాయింపులపై స్పష్టతనిచ్చారు. ఈ నెల 23 (23.03.2026) నుంచి అమల్లోకి వచ్చేలా రాష్ట్రాలకు అదనంగా 20 శాతం గ్యాస్ వాటాను కేటాయిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. దీనివల్ల రాష్ట్రాలకు అందే మొత్తం గ్యాస్ కోటా, ప్రస్తుత సంక్షోభానికి ముందు ఉన్న స్థాయిలో 50 శాతానికి చేరుకుంటుందని, ఇది ప్రజలకు, వివిధ రంగాలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు.ముఖ్యంగా సామాన్యుల ఆహార అవసరాలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్లు, పారిశ్రామిక క్యాంటీన్లు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



## దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు..

**హైదరాబాద్,మార్చి,21,తెలంగాణ దిశ :** దేశవ్యాప్తంగా ఈద్-ఉల్-ఫితర్ పండుగను భక్తి, ఆనందం, సోదరభావంతో ఘనంగా జరుపుకుంటున్నారు. రంజాన్ నెల ముగిసిన సందర్భంగా జరుపుకునే ఈ పండుగ ముస్లింలకు అత్యంత పవిత్రమైనదిగా భావించబడుతుంది. ఒక నెల పాటు రంజాన్ ఉపవాసం చేసిన అనంతరం, నెలవంక దర్శనంతో షవ్వాల్ మాసం ప్రారంభమవుతుంది. ఆ నెల మొదటి రోజున ఈద్ పండుగ ను జరు పుకుంటారు. అల్లాకు కృత జ్ఞతలు తెలిపే రోజుగా కూడా భావి స్తారు. ఇస్లామిక్ విశ్వాసాల ప్రకారం, రంజాన్ మాస ంలోనే పవిత్ర గ్రంథమైన ఖురాన్ అవతరిం చింది. అందుకే ఈ నెలను అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఉపవా సం ద్వారా ఆత్మశుద్ధి, నియమం, సహ నం వంటి విలువలను అలవర్చుకుంటా రు.రంజాన్ ముగిసిన సందర్భంగా జరు పుకునే ఈద్ పండుగ, ఆనందాన్ని పంచు కోవడం, సోదరభావాన్ని పెంపొం దించడం అనే సందేశాన్ని ఇస్తుంది.

## ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం

### బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టింది : కేటీఆర్




**హైదరాబాద్,మార్చి,21,తెలంగాణ దిశ :** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వ్యాఖ్యానించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు.

## త్వరలో తెలంగాణకు ప్రధాని మోదీ..!

**హైదరాబాద్,మార్చి,21,తెలంగాణ దిశ :** ప్రధాని నరేంద్ర మోదీ త్వరలోనే తెలంగాణలో పర్యటించనున్నట్టు సమాచారం. రానున్న పది, పదిహేను రోజుల్లో మోదీ పర్యటన ఉండే అవకాశం ఉంది. మోదీ పర్యటన, జీహెచ్ఎంసీ ఎన్నికలే ప్రధాన ఎజెండాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేడు పార్టీ నేతలతో సమావేశం కానున్నారు. వివరాల మేరకు.. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ.. తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ క్రమంలో మోదీ తెలంగాణలో కూడా పర్యటించేలా స్థానిక నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్ ప్రారంభోత్సవం సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. అలాగే, గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల కోసం పరేడ్ గ్రౌండ్లో ప్రధాని మోదీ బహిరంగ సభకు బీజేపీ ప్లాన్ చేస్తోంది. ఇక, ఇప్పటికే స్థానిక నేతలకు మోదీ టూర్‌పై రాష్ట్ర నాయకత్వం సంకేతాలు ఇచ్చినట్టు సమాచారం. ఇందులో భాగంగానే నేడు సికింద్రాబాద్ నేతలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటర్నల్ సమావేశం ఏర్పాటుచేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు, మోదీ టూర్ ప్రధాన అజెండాగా ఈ సమావేశం జరగనున్నట్లు సమాచారం. కాగా, మోదీ పర్యటనతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో జోష్ పెరిగే అవకాశం ఉంది.





### ప్రముఖ ఒడిస్సీ నృత్యకారిణి మధుమిత రౌత్ కన్నుమూత

ప్రముఖ ఒడిస్సీ కళాకారిణి మధుమిత రౌత్ (59) కన్నుమూశారు. శనివారం ఉదయం ఆమె గుండెపోటుతో మరణించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. 1950వ దశకంలో శాస్త్రీయ పరిజ్ఞానంతో ఒడిస్సీ నృత్య పునరుద్ధరణకు దోహదపడిన మాయాధర్ రౌత్ కుమార్తెనే మధుమిత రౌత్. ఈరోజు మధ్యాహ్నం 3:30 గంటలకు ఢిల్లీలోని లోధి శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు జరుగుతాయని సోదరుడు మనోజ్ రౌత్ తెలిపారు. మధుమిత చిన్న వయస్సులోనే నృత్యం నేర్చుకోవడం ప్రారంభించి.. ఢిల్లీకి చెందిన జయంతిక-మాయాధర్ రౌత్ స్కూల్ ఆఫ్ ఒడిస్సీ డాన్స్ డైరెక్టర్‌గా కొత్త తరం నృత్యకారులకు శిక్షణ ఇచ్చారు. మధుమిత రౌత్ నెదర్లాండ్స్‌లోని ఒక దేవాలయంలో ప్రదర్శన ఇచ్చిన మొట్టమొదటి ఒడిస్సీ కళాకారిణిగా రికార్డు సృష్టించారు.



## మా జోలికి రావొద్దు...

### బ్రిటన్‌కు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్..!

**న్యూఢిల్లీ,మార్చి,21:** అమెరికా-ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్, బ్రిటన్‌కు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడి చేసేందుకు అమెరికా దళాలకు బ్రిటన్ తన సైనిక స్థావరాలను ఉపయోగించుకునేందుకు అనుమతి ఇస్తోందన్న నివేదికల నేపథ్యంలో ఇరాన్ శనివారం తీవ్రంగా స్పందించింది. ఈవివాదంలో బ్రిటన్ జోక్యం శ్రుతి మించితే, ప్రతిస్పందన తీవ్రంగాఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగాఓపోస్ట్ చేశారు. "ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న ఈ యుద్ధంలో భాగం కావాలని బ్రిటన్ ప్రజల్లో అధిక శాతం మంది కోరుకోవడం లేదు. కానీ, వారిప్రధాని స్టార్మర్ మాత్రం సొంత ప్రజల అభిప్రాయాన్ని విస్మరించి, ఇరాన్‌పై దాడికి యూకే స్థావరాలను వాడేందుకు అనుమ తిస్తున్నారు. తద్వారా ఆయన బ్రిటిష్ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మరక్షణ హక్కును వినియోగించు కోవడానికి ఇరాన్ వెనుకాడదు" అని అరాఘ్చి తన పోస్టులో పేర్కొన్నారు. ఈవివాదం తమది కాకపోయినా, బ్రిటన్‌అనవసరంగా తలదూరుస్తోందని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఈ అంశంపై ఇరాన్ తనఆందోళనను అధికారికంగా కూడా బ్రిటన్‌కు తెలియజేసింది. జరుగుతున్న దురాక్రమణలో పాలుపంచుకోవడంగానే" పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు.



### ప్రజల ఓటింగ్ హక్కులు

## లాక్కోనివ్వం..

### చివరి వరకూ పోరాడుతాం - మమతా

కోల్‌కతా: ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ పై తాము సాగిస్తున్న పోరాటం కొనసాగుతుందని, ప్రజల ఓటింగ్ హక్కులను లాక్కునేందుకు ప్రధానమంత్రి మోదీ చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. రంజాన్ సందర్భంగా సెంట్రల్ కోల్‌కతాలో శనివారంనాడు జరిగిన వేడుకలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికలను ప్రభావితం చేసేందుకు చేపట్టిన విస్తృత ప్రయత్నంలో భాగమే ఎస్ఐఆర్ ప్రక్రియ అని విమర్శించారు.'మీ ఓటింగ్ హక్కులను లాక్కునేందుకు మోదీ చేసే ఎలాంటి ప్రయత్నాన్నైనా మేము అడ్డుకుంటాం. ప్రజాస్వామ్యం,ప్రజా హక్కులను పరిరక్షించేందుకు చివరి వరకూ పోరాడతాం' అని మమతా బెనర్జీ చెప్పారు. రివిజన్, వెరిఫికేషన్ పేరుతోఓటర్ల హక్కులను కొల్లగొట్టే ఎలాంటి చర్యలనైనా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. బెంగాల్‌ను, ప్రజలను విడగొట్టేందుకు ప్రయత్నించే వారికి పరాభవం తప్పదన్నారు. మతసామరస్యం పశ్చిమబెంగాల్ ప్రత్యేకత అని, ఇక్కడ హిందువులు,ముస్లింలు,సిక్కులు, క్రైస్తవులు, ప్రతిఒక్కరూ కలిసి మెలిసి జీవిస్తుంటారని సీఎం గుర్తుచేశారు. సమాజాన్ని విడగొట్టే శక్తులను తిప్పిగొడతామని స్పష్టం చేశారు. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 294 మంది సభ్యుల పశ్చిమబెంగాల్ అసెంబ్లీకి రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరుగనుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి.

## తమిళనాడులో కొత్త రాజకీయ కూటమి..



### చేతులు కలిపిన రామదాస్,శశికళ

చెన్నై: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తమిళనాడులో మరో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటైంది. పట్టాలి మక్కల్ కచ్చి (పీఎంకే) వ్యవస్థాపకుడైన రామదాస్, దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలైన శశికళ దీని కోసం చేతులు కలిపారు. విల్లుపురం జిల్లా తైలపురంలోని రామదాస్ నివాసానికి శశికళ వెళ్లారు. కొత్త రాజకీయ కూటమి ఏర్పాటు గురించి సుమారు రెండు గంటల పాటు ఆయనతో చర్చించారు. కాగా, శశికళ సొంతంగా ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఐపీటీఎంఎంకే)తో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాము ఒప్పందం కుదుర్చుకున్నట్లు రామదాస్ తెలిపారు. 'ఈ పొత్తు ఇప్పటికే తమిళనాడులో బలమైన ప్రభావాన్ని చూపింది. పలువురు ప్రత్యర్థులను కలవరపరిచింది. మరిన్ని పార్టీలు మాతో చేరుతాయని భావిస్తున్నాం' అని మీడియాతో అన్నారు. మొత్తం 234 నియోజకవర్గా ల్లో అభ్యర్థులను నిలబెట్టాలని తమ కూటమి యోచిస్తున్నదని వెల్లడించారు.

# ఇండోర్ లో కాస్ట్లీ బిచ్చగాడు..

భోపాల్, : బిచ్చగాడు సినిమా చూశారా.. అందులో విజయ్ ఆంటోని బిచ్చం ఎత్తుకుంటూ జీవిస్తుంటాడు. అతడి దుస్థితిని చూసి చాలామంది బాధపడుతుంటారు. ఈ నేపథ్యంలోనే ఒకానొక సందర్భంలో విజయ్ ఆంటోని వెతుక్కుంటూ చాలామంది వస్తారు. అతడిని చూసి వాహనాల శ్రేణిని ఆపుతారు. ఆ తర్వాతవిజయ్ ఆంటోని ఆ కారులోకి ఎక్కుతాడు. చూసేందుకు ఆ సన్నివేశం చాలా అద్భుతంగా ఉంటుంది. ఇటువంటివి రీ లైఫ్ లో మాత్రమే సాధ్యం. రియల్ లైఫ్ లో పాసిబుల్ కావు. కానీ దీనినినిజం చేసి చూపించాడు ఈ వ్యక్తిమన దేశంలో శుభ్రమైన నగరంగా పేరుపొందిన ఇండోర్ లో ఓ వ్యక్తి యాచకుడిగా జీవిస్తున్నాడు. కాకపోతే అతడు కూటికి గతి లేని వాడు కాదు. గుడ్డకు దిక్కులేనివాడు కాదు. అతడికి ఏకంగా మూడు నివాసాలు ఉన్నాయి. అంతకుమించి అనే స్థాయిలో కార్లు ఉన్నాయి. ఇక ఆటోల గురించి చెప్పాల్సిన పనిలేదు. వడ్డీ వ్యాపారం.. భారీగా బంగారం..ఇలా చెప్పుకుం టూ పోతే అతడు అత్యంత ఖరీదైన బిచ్చగాడు. ఇటీవల మధ్యప్రదేశ్ ప్రభుత్వం బెగ్గర్ ఎరాడికేషన్ క్యాంపియన్ నిర్వహించింది.

ఇందులో అతనికి సంబంధించిన వివరాలు బయటపడ్డాయి.మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడమేనక బలమైన కారణం ఉంది. వీధుల్లో యాచక వృత్తి చేసుకుంటూ జీవించేవారికి ప్రభుత్వం తరఫున ఆర్థికంగా భరోసా కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో యాచించుకుంటూ జీవిస్తున్న మంకీలాల్ అనే వ్యక్తి పై ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. అతడికి పునరాగం కల్పించడానికి ప్రయత్నాలు చేశారు.

అయితే వారు అనుకున్నట్టుగా మంగీలాల్ కూటికి గతి లేనివాడు కాదు. అతడికి భారీగా ఆస్తులు ఉన్నాయి.అధికారుల పరిశీలనలో మంగీలాల్ ఆస్తులు కోట్లల్లో ఉన్నాయి. మంగీలాల్ వద్ద 600 స్క్వేర్ ఫీట్ సామర్థ్యంతో భగత్ సింగ్ నగర్, శివనగర్, అల్వాస్ అనే ప్రాంతాలలో మూడు నివాసాలు ఉన్నాయి.

మూడు ఆటోలు, స్విఫ్ట్ డిజైర్ కార్లు ఉన్నాయి. ఆ కారు నడపడం కోసం మంగీలాల్ ఒక డ్రైవర్ ను కూడా నియమించుకున్నాడు. తను ఈ యాచించడానికి ఎక్కడికి వెళ్లాలన్నా ఆ కారులోనే ప్రయాణ సాగిస్తుంటాడు. ఖాళీ సమయంలో మాత్రం అద్దెకు తిప్పుతుంటాడు. మరోవైపు మంగిలాల్ కోసం మహారాష్ట్ర ప్రభుత్వం 1బిహెచ్కే ఇల్లు కేటాయించింది. అయినప్పటికీ అతడు బిచ్చం ఎత్తుకోవడాన్ని. చెక్కతో చేసిన ఒక కార్డు పట్టుకొని ఇండోర్ నగరంలో యాచిస్తున్నాడు.

# అక్రమార్జనపై ఉద్యోగుల మక్కువ..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ప్రభుత్వ శాఖల్లో అవినీతి వేళ్లానుకుంది. రెవెన్యూ శాఖలో పాసుపుస్తకాలు మొదలుకొని ఇతర అన్ని సేవలకుఉద్యోగులు, అధికారులు లంచం తీసుకుంటున్నారని ఎంతోమంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవలి కాలంలో తెలంగాణలో దాడులు పెరిగాయి. ఫిర్యాదు రావడమే ఆలస్యం ఎసిబిస్పందించి వలపన్నుతోంది. ఎందరో చిక్కుతున్నారు. మరెందరో తప్పించుకుంటు న్నారు. ప్రజల పన్నులతో జీతాలు పొందుతున్న ఉద్యోగులు ప్రజలకు పనులు చేసి పెట్టకుండా లంచాలు మేస్తున్నారు. రెరా అధికారి బాలకృష్ణ మొదలు అనేకమంది పట్టుబడ్డారు. నీటిపారుదల శాఖలో తిమింగలాలు పట్టుబడ్డాయి. వందలకోట్లు అప్పనంగా సంపాదించినా నాయకులు, ఉద్యోగులు అక్రమాస్తులపై మక్కువ వదలడంలేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలో ఎక్కడ చూసినా ఎసిబి కేసులు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. రాజకీయ నాయ కులు, అధికారులు బినామీల పేరుతో ఆస్తులు కూడగడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు ఈ విషయాలను పెద్దగా పట్టించుకోక పోవడం గమనార్హం. రాజకీయ నాయకులు కూడా ఆస్తుల వివరాలు ప్రకటించాల్సి ఉన్నా కొందరు మాత్రమే వెల్లడిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నాయకులు వారితోపాటు వారి కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలు నామినేషన్ సమయంలో అఫిడవిట్‌లో వివరించాల్సి ఉంటుంది. పలు పార్టీల్లో ఉన్న కొందరు రాజకీయ నేతలు ప్రజాప్ర తినిధులు ఎన్నికైన తర్వాత అక్రమార్జనతో కోట్లకు పడుగలెత్తారు. గుత్తేదారుల నుంచి పర్సెంటే జీలు మొదలుకొని ప్రభుత్వ, ఆస్తులను ఆక్రమించుకొనే వరకు మరీ అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రిజిస్ట్రేషన్‌కు మామూళ్లు వసూలు చేస్తున్నారని విమర్శలు లేకపోలేదు. ఇది నిజమని తెలిసినా వారిని ఎవరూ అడ్డుకోవడం లేదు. నిషేధిత ఆస్తులు సైతం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి కొందరు కోట్లు సంపాదించిన ఉదంతాలు ఉన్నాయి. ఈ శాఖలో ఉద్యోగుల బదిలీల్లోనూ అక్రమాలకు పాల్పడిన ఉదంతం



మనకు తెలిసిందే. నీటిపారుదలశాఖ, రోడ్లు భవనాలశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, నగరపాలకసంస్థ, పురపాలకలు, విద్యుత్‌శాఖ పరిధిలో జరిగే ప్రతి పనుల్లో అధికారులు, ఉన్నతాధికారులు, నేతలకు పర్సెంటీజీ లు అందుతాయనేది బహిరంగ రహస్యమే. పోలీసుశాఖ లో నెలసరి మద్యం మామూళ్లు, కేసుల వ్యవహారాల్లో వసూళ్ల దందా మామూలై పోయిందని బాధితులు వాపోతున్నారు. ఇలా ప్రతిశాఖలోనూ అవినీతి, అక్రమాల పలు పంథాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు, ఉన్నతాధికారులు కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. అక్రమాస్తులు కూడగడితే శిక్ష తప్పదని కోర్టు మరోమారు రుజువు చేసినా అక్రమార్కులు తమ చేతులు తడపనిదే పనులు చేయడం లేదు. మద్య నిషేధ, అబ్కారీ శాఖలో కానిస్టేబుళ్లు మొదలు కొని ఉన్నతాధికారుల వరకు నెలసరి మామూళ్లు పుచ్చుకుంటున్నారు.అక్రమార్కులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని రుజువు చేస్తున్నా ఉద్యోగుల తీరు మారడం లేదు. ఇకపోతే నాయకులు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడు తున్నారు. ఇలా అక్రమంగా సంపాదించే ప్రతిఒక్కరూ ఆలోచించా ల్సిన తరుణమిది. ఇలా అక్రమాస్తుల కేసుల్లో పట్టుబడిన వారు ప్రతి జిల్లాలోనూ ఉన్నారు.

వీరి కేసులు ప్రస్తుతం న్యాయస్థానాల పరిధుల్లో ఉన్నాయి. ప్రసుతం కేసులన్నీ కోర్టు విచారణలో ఉన్నాయి. పలువురు అవినీతి ఉన్నతాధికారుల పైన గతంలోనూ కేసులు నమోదయ్యాయి. అయితే అక్రమాస్తుల సంపాదనకు నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి విశ్వరూపం దాలుస్తోందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వశాఖలో ఉద్యోగిగా చేరే వ్యక్తి మొదట తన ఆస్తుల వివరాలు ప్రభుత్వానికి తెలియజేయాలి.లేదంటే ఉద్యోగంలో చేరిన తర్వాత వచ్చే మొదటి జనవరి నెలాఖరులోగా తెలియపరచాల్సి ఉంటుంది. లక్షరూపాయ లకుమించి విలువ చేసే బంగారు,వాహనం ఇతర చరాస్తులు కొన్నట్లయితే ఉన్నతాధికారులకు తెలియజేయాలి. స్థిరాస్థి విషయంలో అడుగుస్థలం కొనుగోలు చేసినా తెలియపరిచాల్సిందే.

# కేదార్‌నాథ్, బద్రీనాథ్

## ఎంట్రీ ఫర్ హిందూస్ ఓన్లీ

న్యూఢిల్లీ, : ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ ప్రవేశాలపై కీలక ప్రకటన వెలువడింది. ఈ రెండు ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించాలని బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతిపాదించింది. మతపరమైన సంప్రదాయాలను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కమిటీ ఛైర్మన్ తెలిపారు. విశ్వాస కేంద్రాలైన ఈ ధామ్‌లలోకి తమ విశ్వాసాన్ని గౌరవించేవారినే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన త్వరలో బోర్డు ముందుంచనున్నారు. దీనికి బోర్డు ఆమోదం లభిస్తుందని భావిస్తున్నారు.దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్ , బద్రీనాథ్ ఆలయాల్లోకి ఇకపై కేవలం హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. హిందువులు కాని వారు ఈ ఆలయాల్లోకి ప్రవేశించడానికి వీలు లేకుండా నిషేధం విధించాలని.. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతిపాదించింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ బీకేటీసీ ఛైర్మన్ ధ్రువీకరించారు. హరిద్వార్‌లోని కుంభమేళా ప్రాంతంలో 105 ఘాట్‌లలో హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించాలని ప్రతిపాదన వచ్చిన కొద్ది రోజులకే ఈ ప్రకటన రావడం గమనార్హం. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలతో పాటు.. బీకేటీసీ పరిధిలోకి వచ్చే మరో 47ఆలయాల్లో కూడా హిందువులు కాని వారిని ప్రవేశించకుండా నిషేధం విధించేలా చర్యలు తీసుకో వాలని ఆలోచిస్తోంది. ఈ ప్రతిపాదనను త్వరలో బీకేటీసీ బోర్డు ముందు ఉంచే అవకాశం ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, చాలా మంది భాగస్వాములు దీనికి మద్దతు ఇస్తున్నారు. బీకేటీసీ ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, హిందువులు కానివారిని నిషేధించాలనే ప్రతిపాదన చాలా కాలం నుంచి ఉందని తెలిపారు. "దీనిని ఆదిశంకరాచార్యుల కాలం నుంచీ పాటిస్తున్నారు. మతపర మైన సంప్రదాయాలను కాపాడుకోవడంలో తప్పులేదని మేము భావిస్తున్నాము," అన్నారు. "చారిత్రాత్మకంగా, హిందువులు కాని




వారి ప్రవేశం ఆలయాలలో నిషేధించబడింది," అని ఆయన తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ని ఉటంకిస్తూ, మతపరమైన వర్గాలకు తమ వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు ఉందని, కాబట్టి ఈనిర్ణయం తీసుకోవడానికి కమిటీకి పూర్తి హక్కు ఉందనిఆయన స్పష్టం చేశారు. "హిందువులు కానివారు" అనే పదాన్ని తప్పుగా అర్థం చేసుకోకూడదని కూడా ఆయన స్పష్టం చేశారు. "మా విశ్వాసాన్ని గౌరవించేవారు స్వాగతించబడతారు. ఈ ధామ్‌లు పర్యాటక కేంద్రాలు కావు, అవి విశ్వాస కేంద్రాలు," అని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఉత్తరాఖండ్ ప్రభుత్వం హరిద్వార్‌లోని 105 ఘాట్‌లలో హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించడం గురించి ఆలోచిస్తోంది. అలాగే, హరిద్వార్, రిషికేశ్‌లను 'సనాతన పవిత్ర నగరం'గా ప్రకటించాలని కూడా పరిశీలిస్తోంది. హరిద్వార్ అర్ధ కుంభమేళాతో ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని, 1916లో గంగా సభ వ్యవస్థాప కుడు మదన్ మోహన్ మాలవ్యతో జరిగిన ఒప్పందంలోని నిబంధనలను కూడా దీనికి ఉపయోగించుకోవచ్చని వర్గాలు తెలిపాయి.ఈ ప్రతిపాదనలు భక్తులలో చర్చనీయాంశంగా మారాయి. ఆలయాల పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ఇది పర్యాటకులను, ఇతర మతాల వారిని ఎలా ప్రభావితం చేస్తుందో చూడాలి. ఈ విషయంలో భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# టూ టైర్ సిటీస్ లో రియల్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన టైర్-2 నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వరంగల్, కరీంనగర్, తిరుపతి వంటి నగరా ల్లో ఓపెన్ ప్లాట్ల వ్యాపారం గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 15 శాతంవృద్ధిని నమోదు చేసింది. హైదరాబాద్ వంటి మెట్రో నగరా ల్లో ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం, ఐటీ,పారి శ్రామిక రంగాలు ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తుం డటంతో పెట్టుబడిదారులు ఇప్పుడు ఈ ప్రాంతాల వైపు మొగ్గు చూపుతు న్నారు.ముఖ్యంగా మధ్యతరగతి వర్గాల వారు భవిష్యత్తు అవసరాల కోసం ఈ నగరాల శివార్లలో ప్లాట్లు కొనడానికి ప్రాధా న్యత ఇస్తున్నారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతిపె ద్ద నగరంగా ఎదుగు తున్న వరంగల్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ కనిపిస్తోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ,వరంగల్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ వార్తలు ఇక్కడి భూముల ధరలకు రెక్కలు తెచ్చాయి. కరీంనగర్‌లో ఐటీ టవర్లు, పర్యాటక రంగ అభివృద్ధి వల్ల పట్టణ సరిహద్దులు వేగంగా విస్తరిస్తున్నాయి. గతంలో కేవలం వ్యవసాయ భూములుగా ఉన్న ప్రాంతాలు నేడు డీటీసీపీ అనుమతి పొందిన లేఅవుట్లుగా మారుతున్నాయి. ఇక్కడ గత ఏడాదితో పోలిస్తే ప్లాట్ల అమ్మకాల్లో సుమారు 14 నుంచి 16శాతం వరకు ధరల పెరుగుదల కనిపించడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో కూడా ఇదే విధమైన ట్రెండ్ కొనసాగుతోంది. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో పాటు, అక్కడ ఏర్పాటవుతున్న కొత్త టౌన్‌షిప్‌లు ,పారిశ్రామిక కారిడార్లు రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన కారణమయ్యాయి. తిరుపతి-మదనపల్లి , తిరుపతి-చెన్నై హైవేల వెంట వెలుస్తున్న ఓపెన్ ప్లాట్ వెంచర్లకు డిమాండ్ భారీగా పెరిగింది కనెక్టివిటీ ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్లు, అండర్ పాస్లు ,మెరుగైన డ్రైనేజీ వ్యవస్థలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్నిపెంచాయి. అపార్ట్‌మెంట్ల కంటే ఓపెన్ ప్లాట్లపై పెట్టుబడి పెడితే తక్కువ కాలంలోనే ఎక్కువ లాభం వస్తుందని భావించడం కూడా ఈ రంగం పుంజుకోవడానికి కారణం.

# బెట్టింగ్ యాప్ లపై కొరడా..




న్యూఢిల్లీ: బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం కొరఢా ఝుళిపించింది. ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ వల్ల యువత ఆర్థికంగా చితికిపోకుండా ఉండేందుకు కేంద్రం తాజాగా 242 చట్ట విరుద్ధమైన వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది. అమల్లోకి వచ్చిన కొత్త గేమింగ్ చట్టం ప్రకారం ఇప్పటివరకు దాదాపు 8 వేల వెబ్‌సైట్లపై నిషేధం విధించింది. నగదు ప్రమేయం ఉన్న ఆన్‌లైన్ గేమ్స్‌ను నిర్వహిస్తే భారీ జరిమానాలు తప్పవని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది.ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వెబ్‌సైట్లపై కేంద్ర ప్రభుత్వం మరోసారి ఉక్కుపాదం మోపింది. ఒక్కరోజే దేశవ్యాప్తంగా 242 చట్టవిరుద్ధమైన వెబ్‌సైట్లను బ్లాక్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దేశ యువతను ఈ చెడు వ్యసనాల నుంచి కాపాడటమే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా బ్లాక్ చేసిన 242 సైట్లతో కలిపి.. ఇప్పటివరకు దేశంలో మొత్తం 7,800 కంటే ఎక్కువ బెట్టింగ్, జూదపు ప్లాట్‌ఫామ్‌లను నిలిపివేశారు. గత ఏడాది తీసుకొచ్చిన కొత్త చట్టం తర్వాత ఈ చర్యలు మరింత వేగవంతం అయ్యాయి ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని క్రమబద్ధీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025 ను అమలులోకి తెచ్చింది. ఈ కొత్త చట్టం 2025 అక్టోబర్ 1వ తేదీ నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చింది. డబ్బుతో కూడిన అన్ని రకాల ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ సైట్లపై ఈ చట్టం పూర్తిగా నిషేధం విధిస్తుంది. ఇందులో నైపుణ్యంతో కూడిన ఆటలైనా లేదా అదృష్టంపై ఆధారపడే ఆటలైనా నగదు ప్రమేయం ఉంటే అవి చట్టవిరుద్ధ మేనని కేంద్రం తేల్చి చెప్పింది. ఈ చట్టం ప్రకారం చట్టవిరుద్ధమైన గేమ్స్ నిర్వహించే వారికి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.1 కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.ఈ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం గేమింగ్ సేవలను అందించే సంస్థలు.. బెట్టింగ్ సైట్లను ప్రచారం చేసే ప్రకటనదారులు, ప్రమోటర్లు.. ఆ ప్లాట్‌ఫామ్‌లకు ఆర్థిక సహకారం అందించే వారిపై ప్రధానంగా చర్యలు తీసుకుంటుంది. ఈ ఆటలు ఆడే ప్లేయర్స్‌పై ప్రస్తుతానికి ఎలాంటి జరిమానాలు విధించబడవని.. కేవలం నిర్వహా కులపైనే చర్యలు ఉంటాయని తెలుస్తోంది. ఈ-స్పోర్ట్స్‌కు ప్రోత్సాహం: అన్ని ఆటలను నిషేధించడం కాకుండా.. విద్య, సా మాజిక స్పృహను పెంపొందించే ఈ-స్పోర్ట్స్.. ఎడ్యుకేషనల్ గేమ్స్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వీటి నియంత్రణకు ఒక ప్రత్యేక అథారిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు.

# 400 కోట్ల బ్లాక్ మనీ!



బెంగళూరు,: కర్ణాటక-గోవా సరిహద్దులోని చోర్లా ఘాట్ అడవుల్లో గతేడాది అక్టోబరులో జరిగిన ఓ చోరీ ఘటన ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. గోవా నుంచి కర్ణాటక మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్న రెండు భారీ కంటైనర్లను గుర్తుతెలియని ముఠా అడ్డుకుని, అందులోని భారీ నగదును దోచుకెళ్లింది. శ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈదోపిడీ జరిగిన మూడు నెలల వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఇటీవల నాసిక్‌కు చెందిన సందీప్ పాటిల్ అనే వ్యక్తి తాను కిడ్నాప్‌కు గురయ్యానని, దోపిడీ గురించి తెలుసుకున్నందుకే తనను బంధించారని ఫిర్యాదు చేయడంతో ఈ మెగా ధూమ్ దోపిడి బయటపడింది.ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం ఎస్పీ స్థాయి అధికారినేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. తాజాగా బెల్గాం పోలీసులు కూడా ఈ విచారణలో చేరారు. మూడు రాష్ట్రాల పోలీసులు ఇప్పుడు ఆ మాయమైన కంటైనర్ల కోసం అడవులను జల్లెడ పడుతు న్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఒక హవాలా ఆపరేటర్‌తో సహా ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.ఈ దోపిడీ వెనుక కేవలం దొంగలే కాదు, కొందరు పోలీసు అధికారులు, ఒక ప్రముఖ మత గురువు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కంటైనర్లను అడ్డుకున్న ముఠాకు పోలీసులే సహకరించారని, అసలు బాధితుడు ఎవరో కూడా స్పష్టంగా తెలియకుండా జాగ్రత్త పడ్డారని తెలుస్తోంది. థానేకు చెందిన ఒక బిల్డర్‌కు చెందిన పాత నోట్లను మార్పిడి చేసే క్రమంలో ఈ దోపిడీ జరిగినట్లు సిట్ అనుమానిస్తోంది.అయితే బాధితుడు బయట కు వచ్చి ఫిర్యాదు చేయకపోవడం ఈ కేసులో అతిపెద్ద మిస్టరీగా మారింది.బెల్గాం పోలీసులు నాసిక్ వెళ్లి నిందితులను విచారించేందుకు అనుమతి కోరారు. అయితే, ఆ దోపిడీ నగదు నిజంగానే 400 కోట్లా లేక అంతకంటే ఎక్కు? అన్నది ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. సంఘటనా స్థలం మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో, నిందితులు ఎక్కడ నగదును దాచారనే దానిపై క్లూస్ కోసం సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకూ బయటకు వచ్చిన సమచారం చాలా తక్కువ. ఇంకా చాలా బయటకు రావాల్సి ఉంది. గుట్టుగా ముగిసిపోతుందా.. ప్రజలకు తెలిసేలా బయటపెడతారా అన్నది మాత్రం ఇంకా ఎవరికీ తెలియదు.

# వ్యూహాత్మక మౌనమే పరిష్కారమా..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరగడం సహజం, ప్రజలు క్షమించడానికి సమయం పడుతుంది. తర్వాతి ఎన్నికల్లో ప్రజలే భవిష్యత్‌ను నిర్ణయిస్తారు. కానీ పదేళ్ల అధికారంతో తెలంగాణ చాంపియన్ లుగా ప్రచారం చేసుకున్న బీఆర్‌ఎస్‌ను 2023 ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత లేదు. హామీలు అమలు చేయకపోయినా విపక్షాల నుంచి తప్ప ప్రజల నుంచి విమర్శలు రావడం లేదు. ఇక బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే రేవంత్ సర్కార్‌ను నిత్యం టార్గెట్ చేస్తున్నారు. దీంతో విశ్లేషకులు నేతలకు ఓపిక ఉండాలని సూచిస్తున్నారుకేటీఆర్ ప్రతీ మాట సామాన్యుడి మనసులో కౌంటర్‌గా మారుతోంది. ఇదితన మాటల విలువను తగ్గిస్తూ, పార్టీకి నష్టం కలిగిస్తోం ది. రేవంత్‌పై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ కేటీఆర్ స్వయం పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతున్నారు. గత అధికార కాలంలోని తప్పులు గుర్తుంచుకో కుండా విమర్శిస్తుండడంతో ప్రజలు పెద్దగా కనెక్ట్ కావడం లేదు.తాజా పార్టీ మార్పులపై కేటీఆర్ వ్యాఖ్యలు గతాన్ని గుర్తు చేస్తున్నాయి. బీఆర్‌ఎస్ అధికారంలో ఉంటూ ప్రతిపక్షాలను అణచివేసి, తెలంగాణ పోరాటకా రులను దూరం చేసి, కొత్తలకు పదవులు పంచారు. ఇప్పుడు కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేస్తున్నారు.

రాజ్యాంగ విలువలను ప్రశ్నిస్తున్నారు. అప్పటి ఫిరాయింపులు 'బంగారు తెలం గాణ' పేరుతో జరిగాయని ప్రజలు మరువలేదు కేటీఆర్.ప్రస్తత పరిణామాల్లో మౌనం చాలా మంచిది. ప్రజలకు ఆలోచనకు సమయం ఇవ్వాలి. గత తప్పులకు పశ్చాత్తాపం చెంది, భవిష్యత్తులో అవి జరగకుండా హామీ ఇవ్వాలి. పడిగట్టు మాటలు, నాన్ స్టాప్ విమర్శలు ప్రజల మద్దతు ఆకర్షించవు. కేటీఆర్ దీన్ని గుర్తించి వ్యూహం మార్చితే పార్టీకి లాభం.అధికారంలో ఉంటూ అందరినీ 'గులాబీకారు'లో ఎక్కించిన గతం ప్రజల మనసుల్లో ఉంది. ఇప్పుడు విమర్శలు చేసినా, స్వీయ పరిశీలన లేకపోవడం వల్ల ప్రజలు దూరమవుతున్నారు.

# సంపాదకీయం

## 9 దేశాలు ఖతం..!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ ట్రెండ్ మార్మోగుతోంది. 1995 నుంచి 2012 మధ్య జన్మించిన పిల్లలనే జనరేషన్ జెడ్ అని పిలుస్తుంటారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన డిజిటల్ విప్లవం, అధునాతన స్మార్ట్ ఫోన్ లు, ఇంటర్నెట్, ఏఐ యుగంలో వీళ్లు జన్మించారు. ఈ తరంలో జన్మించినవారు అంతకుముందు తరాలవారి వ్యవహారశైలికి భిన్నంగా ఉంటున్నారు. తమపై ప్రభుత్వాలు ఆంక్షలు విధించడాన్ని జెన్ జెడ్ అసలు అంగీకరించడం లేదుబల్గేరియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంది. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో పెరిగిన అవినీతి ఆరోపణలు, దేశవ్యాప్త నిరసనల కారణంగా ప్రధాని రొసెన్ జెలియాజ్‌కోవ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రాజీనామా చేసింది. జెన్–జీ దెబ్బకు మరో ప్రభుత్వం కూలిపోయింది. బల్గేరియా ప్రభుత్వం 2026 ముసాయిదా బడ్జెట్‌ను రూపొందించింది. ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఈ బడ్జెట్‌ని రూపొందించారని యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. దీంతో ప్రభుత్వం వెంటనే ముసాయిదా బడ్జెట్‌ను ఉపసంహరించుకున్నప్పటికీ.. యువత ఆందోళనలు విరమిచలేదు. ప్రధాని రొసెన్ జెలియాజ్‌కోవ్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాకముందే.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం చేపట్టాలని నిర్ణయించింది. అవిశ్వాస తీర్మానం పార్లమెంట్‌లో ఓటింగ్‌కు రాకముందే.. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు బల్గేరియా ప్రధాని ప్రకటించారు. ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్‌లో ఓటింగ్ జరగడానికి ముందే.. నిరసనకారుల గళాన్ని గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించారు. ముఖ్యంగా జనవరి 1న బల్గేరియా యూరోజోన్‌లో చేరేందుకు కేవలం 20 రోజులు మాత్రమే ఉన్న కీలక తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం దేశ రాజకీయాల్లో అనూహ్య మలుపుగా మారింది. బల్గేరియాలో జెన్ జెడ్ సాగించిన అవినీతి వ్యతిరేక ఆందోళనల ధాటికి ప్రధాని రొసెన్ జెలియాజ్‌కోవ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పతనమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాకముందే.. తమ ప్రభుత్వం రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని గురువారం ప్రకటించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగడానికి కొద్దిసేపటి ముందే ఆయన ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.బల్గేరియాలో అవినీతికి వ్యతిరేకంగా వేలాది మంది యువజనులు బుధవారం దేశవ్యాప్తంగా భారీ ఆందోళనలు నిర్వహించారు. ఈ నిరసనలకు ప్రధాన కారణం ప్రభుత్వం రూపొందించిన 2026 ముసాయిదా బడ్జెట్. ఈ బడ్జెట్ అవినీతిని కప్పిపుచ్చేందుకు రూపొందించిందని యువతరం తీవ్రంగా మండిపడింది. ఈ ముసాయిదాపై ఆగ్రహించిన నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం గత వారం ఈ ముసాయిదా బడ్జెట్‌ను ఉపసంహరించుకున్నప్పటికీ.. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ఏ మాత్రం చల్లారలేదు. యువతరం అవినీతి, పాలన లోపాలపై నిరసన కొనసాగించడంతో.. జెలియాజ్‌కోవ్ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి తీవ్రమైందిప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపక్షం ప్రవేశ పెట్టడం, దేశవ్యాప్త నిరసనలతో ప్రజాగ్రహం పెరగడంతో ప్రధాని రొసెన్ జెలియాజ్‌కోవ్.. అధికార పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశం అనంతరం ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రాజీనామా చేయడమే సరైన నిర్ణయమని ప్రకటిస్తూ.. గురువారం తన రాజీనామాను సమర్పించారు. ఈ పరిణామం బల్గేరియా రాజకీయాల్లో అస్థిరతకు దారి తీసింది. పూర్తిస్థాయి ప్రజాదరణ ఉన్న ప్రభుత్వం ఏడాది కూడా పూర్తి చేయకుండానే కూలిపోవడంతో.. దేశంలో ఆకస్మిక ఎన్నికలు అనివార్యం కానున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.2020లో బొయికో బోరిస్సోవ్ ప్రభుత్వాన్ని అవినీతి వ్యతిరేక నిరసనలు కూల్చినప్పటి నుంచి దేశంలో ఏడు ఎన్నికలు జరిగాయి. ఈసారి రాజీనామా చేయకముందు కూడా జెలియాజ్‌కోవ్ ప్రభుత్వం ఐదు అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొని గట్టెక్కింది. రాజీనామా తర్వాత కూడా మంత్రులు కొత్త మంత్రివర్గం ఎన్నికయ్యే వరకు తమ పాత్రలను కొనసాగిస్తారని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.జెన్ జెడ్ ఆందోళనలు బంగ్లాదేశ్ లోనూ చెలరేగాయి. అక్కడ కూడా ప్రభుత్వం కుప్పకూలింది. తాజాగా యువత చేతిలో నేపాల్ బలైంది. ఇప్పుడు పెరూ దేశం కూడా జెన్ జెడ్ ఆందోళనల ధాటికి అట్టుడుకిపోతుంది. ఈ సంవత్సరంలో మొత్తం 8 దేశాల్లో జెన్ జెడ్ ఆందోళనలు చేపట్టింది. ఇండోనేషియాలో మొదలుపెట్టి ఇప్పుడు పెరూ వరకు వచ్చింది. పెరూ రాజధాని లిమాలో వేలాదిమంది యువత రోడ్లపైకి వచ్చి ఆ దేశ అధ్యక్షుడు దినా బోలువార్టే కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య ఉద్రిక్తమైన పరిస్థితులు నెలకున్నాయి. పోలీసులు టియర్ గ్యాస్ ను ప్రయోగించారు. లాఠీఛార్జీ చేశారు. అయితే పోలీసులపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. పెన్షన్ సిస్టమ్‌లో పలు మార్పులు చేసినందుకు ఈ ఆందోళనలు ప్రారంభమై నట్లు తెలుస్తోంది.

# జంతు పరిరక్షణ అందరి బాధ్యత



హక్కులు కేవలం మనిషికే కాదు జంతువులకూ ఉండాలన్న ఉద్దేశ్యంతో యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ అనిమల్ రైట్స్‌ని ప్రకటించారు. ఈ డిక్లరేషన్‌ని 1998లో ప్రపంచ దేశాలు ఆమోదించాయి. మానవ హక్కుల దినమైన డిసెంబర్ 10న జంతువుల హక్కుల దినంగా చేయడం ద్వారా మనుషులు, జంతువులు ఒకటేనన్న సందేశం అందరికీ అందించడమే ఈ దిన ప్రధాన లక్ష్యం. మాంసం కోసం, వినోదం కోసం మానవులు అనేక రకాలుగా జంతువుల ప్రాణాలు తీస్తున్నారు.

తమ వృత్తులకు, అవసరాలకు జంతువులను ఉపయోగించుకుంటూ వాటిని హింసిస్తున్నారు. ఆవు, మేక, గేదె మొదలైన జంతువులు ఎక్కువ పాలు ఇవ్వడం కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వానిని హింసిస్తున్నారు. జంతు సంక్షేమానికి సంబంధించి 1960లో పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ్యపూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భూమి మీద మనుషులతో పాటు ఎన్నో రకాల జంతువులూ ఉన్నాయి.

వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. జీవం నుండి జీవం రావడం మాత్రమే కాదు. ఒక జీవ జాతి అదే జీవ జాతి నుండి మాత్రమే ఉత్పన్నం అవుతుంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగైపోతున్నాయి. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, ప్రధానంగా జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియజేస్తుంది. భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి.


జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం. జంతు సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడుకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి.

దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతంగల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు ‘హేలీ’ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102.

1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది. ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. జంతువులపట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాథమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది. భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం ధృవపరుస్తున్నది. భారత పార్లమెంటు రూపొందించిన జంతువులపట్ల క్రూరత్వం నివారణ చట్టం సెక్షన్ 11 (1) నుండి (ఓ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించడం లేదా చంపడంవంటి అనేక ఇతర క్రూర చర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిసారు. జంతు రవాణాలో అనవసర హింసకు పాల్పడే వారికి, జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపేవారికి, జంతువుల కాళ్ళు కట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ 100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు. భారత శిక్షా స్మృతి సెక్షను 428 మరియు 429 కింద జంతువులను భయపెట్టడం గాయ పరచడం చట్ట విరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడాన్ని 1860 భారత శిక్షాస్మృతి సెక్షన్ 503 ప్రకారం తెలిసి లేదా స్పృహతో చేస్తున్న నేరంగా పరిగణిస్తారు.

ఇటువంటి వారిని ఎటువంటి వారంటు లేకుండా అదుపులోకి తీసుకోవచ్చు. జంతుసంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడంతోపాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం, జంతువులకూ తగిన గౌరవాన్ని అందజేయడం అందరి బాధ్యత. జంతువులపట్ల మరింత మానవీయంగా ప్రవర్తించడం, ఈ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం అవసరం. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం.

# సాఫ్ట్‌గా మాధవ్.. ఇక పెరిగేది ఎలా..?



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** దక్షిణాదిలో ఏపీలో మాత్రమే బీజేపీకి చెప్పుకోదగ్గ స్రెంథ్ లేదు. ఒంటరిగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా వచ్చే సీన్ లేదు. అందుకే కూటమిలో భాగంగా ఉంటూనే..నవ్యాంధ్రలో కమల వికాసం కోసం ఎత్తులు వేస్తున్నారు జాతీయ పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను నిర్వహించడం తప్ప.. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం, క్యాడర్ బలోపేతం కోసం అధ్యక్షుడిగా మాధవ్ కొత్తగా చేస్తున్నదేమి లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధ్యక్షుడు చేపడుతున్న కొద్దిపాటి యాక్టివిటీకి కూడా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల నుంచి కోఆపరేషన్ లేదని క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. 2019లో ఒంటరిగా పోటీ చేసి ఓట్లు తెచ్చుకోవడం తప్ప..ఒక్క సీటు కూడా గెల్వలేకపోయింది బీజేపీ. 2024కు వచ్చే సరికి కూటమిగా జత కట్టి..అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఉభయ సభల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం దక్కించుకుంది. కమలనాథులు. ఇప్పటికంటే ఇంకింత బలంగా..మరింత స్ట్రాంగ్‌గా నిలబడేందుకు సరికొత్త స్ట్రాటజీస్ ప్లే చేస్తున్నారు. అందుకే ఓ చేతిలో బీజేపీ జెండా.. ఇంకో చేతిలో కూటమి అజెండాతో..కలిసి నడుద్దాం. పార్టీ కోసం కష్టపడుదామంటూ ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పిలుస్తున్నారు. కానీ సీనియర్ లీడర్లలో మాత్రం ఆ దూకుడు కనిపించట్లేదట.అదే కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు దూసుకెళ్తున్న స్పీడుగా..కమలనాథులు ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారట. దీంతో ఏపీలో బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ యాక్టివ్ గానే ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. అధికార కూటమి కీలకంగా ఉన్న టీడీపీ..మళ్లీ పవర్‌లోకి రావాలని ఎత్తులు వేస్తున్న వైసీపీ..ఎక్కడా తగ్గట్లేదు. రేపే ఎలక్షన్స్ ఉన్నాయన్నట్లుగా ఆ రెండు పార్టీలు ఎప్పుడూ సూపర్ యాక్టీవ్‌గా ఉంటున్నాయి.జనసేన కూడా అటు పార్టీ నిర్మాణంలోనూ ఇటు పొలిటికల్‌గాను దూకుడు మీదుంది. చివరికి కాంగ్రెస్ పార్టీ కూడా ఏదొక హడావుడి చేస్తూనే ఉంటుంది. పార్టీకి క్యాడర్,లీడర్లు లేకపోయినా షర్మిల చేసే పొలిటికల్ కామెంట్స్ నిత్యం ప్రజల్లో చర్చనీయాంశం అవుతున్నాయి. కానీ ఏపీలో బీజేపీ మాత్రం అంత యాక్టీవ్‌గా కనిపించట్లేదన్న చర్చ ఉంది.ఏపీలో కూటమిలో భాగస్వామిగా ఉన్నా అటు ప్రభుత్వంలోనూ ఇటు పొలిటికల్ గాను పార్టీ యాక్టివిటీ చాలా తక్కువ. ఇక పార్టీ బలోపేతం కోసం, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బలమైన ప్రయత్నాలేమి జరగడం లేదని కార్యకర్తలే చర్చించుకుంటున్న పరిస్థితి. దీనికి కారణం బీజేపీ కీలక నేతలు సైలెంట్ మోడ్‌లో ఉండటమే అంటున్నారు.కేంద్రంలో అధికారంలో ఉంటూ..చాలా రాష్ట్రాల్లో పవర్‌లో కొనసాగుతూ..ఏపీ ప్రభుత్వంలో కీరోల్ ప్లే చేస్తున్నప్పటికీ..ఏపీలో మాత్రం ఆశించినంతగా కమలం లీడర్లు దూకుడు ప్రదర్శించడం లేదంటున్నారు. పక్కనే ఉన్న తెలంగాణలో బీజేపీ లీడర్లు అధికారంలోకి వచ్చేది తామేనని చెప్పుకుంటూ..అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌ను ఢీకొడుతూ ముందుకెళ్తుంటే..ఏపీ బీజేపీ లీడర్లు పార్టీని గాలికి వదిలేశారని క్యాడర్ బాణాలు ఎక్కుపెడుతోంది.ఏపీలో బీజేపీకి 12 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ఒక ఎమ్మెల్సీతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలో ఒక మంత్రి ఉన్నారు. ఏపీ నుంచి గెలిచిన ముగ్గురు బీజేపీ ఎంపీల్లో భూపతిరాజు శ్రీనివాసవర్మ కేంద్రమంత్రిగా ఉన్నారు. వీరికి తోడు పార్టీలో సీనియర్ నేతలు ఉన్నారు. వీరెవరూ పార్టీ బలోపేతం కోసం ప్రత్యేక చొరవ చూపట్లేదని కార్యకర్తలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కేంద్రం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా ఎలాంటి యాక్టీవిటీ చేపట్టకపోవడంతో పాటు..పొలిటికల్ ఇష్యూస్‌పై కూడా ఒక్కరూ నోరెత్తకపోవడం చర్చనీయాంశంగా మారింది. లీడర్లే సైలెంట్ మోడ్‌లో ఉండటంతో ఏపీ బీజేపీపై ప్రజల్లో చర్చకే ఆస్కారం లేకుండా పోయిందంటున్నారు. అధ్యక్షుడిగా మాధవ్ ఉన్నప్పటికీ ఆయన వాయిస్ పెద్దగా ప్రజలోకి వెళ్లడం లేదనేది రాజకీయ వర్గాల్లో చర్చ.ఇలాంటి పరిస్థితుల్లో మెల్లగా పార్టీని బలోపేతం చేసుకుంటూ పోతే చట్టసభల్లో తమ ప్రాతినిధ్యాన్ని ఇంకా పెంచుకునే అవకాశం ఉంటుంది. కానీ ఆ దిశగా ఏపీ బీజేపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలేమి లేవంటున్నారు కార్యకర్తలు. త్వరలోనే స్థానిక, మున్సిపోల్స్ ఎన్నికలు రాబోతున్నాయి. స్థానిక, పురపోరు కోసం పార్టీని సన్నద్ధం చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ద్వితీయ శ్రేణి నేతలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారుఅధికారంతో సంబంధం లేకుండా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలు..నేతలు..ఏపీ బీజేపీ నేతల తీరుపైతీవ్ర అసహనంతో ఉన్న పరిస్థితి. కూటమిలో టీడీపీ, జనసేన తమపార్టీలను మరింతబలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తుంటే బీజేపీ లీడర్లు మాత్రం పార్టీని పట్టించుకోవడమే మానేశారన్న విమర్శలు కమలం పార్టీలో కాక పుట్టిస్తున్నాయి.

# డాలర్, ఆయిల్‌పై ఆధిపత్య ధోరణి..!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో మార్పు వస్తోంది. డాలర్ ఆధిపత్యానికి గండికొట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. చమురుపై పెత్తనాలను సహించడం లేదు. చైనా యెన్, రష్యా రూబుల్స్, భారత్ రూపాయిల్లో వ్యాపారాలకు సమాయత్తం అవుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా వస్తుమార్పిడి పద్ధతిలో వ్యాపారాలకు తెరదీస్తున్నారు. ఆయా దేశాలు ఈ రకమైన ఒప్పందాలకు ముందుకు కదులుతున్న వేళ ఇవన్నీ కూడా అగ్రరాజ్యం అమెరికాకు కంటకింపుగా మారాయి. ఇవన్నీ జరిగితే డాలర్ పతనం అవుతుంది. చమురుపై ఆధిపత్యం పోతుంది. అందుకే అమెరికా పావులు కదిపింది. ప్రపంచ దేశాలను గుప్పిట పెట్టుకునే ప్రయత్నంలో భాగంగా వెనుజులాపై దాడికి తెగించింది. ఆ దేశ అధ్యక్షుడు ముదురోను కిడ్నాప్ చేసిబందీగా తీసుకెళ్లింది. అయితే ఈఘటనపై వెనిజులాలో ఎక్కడా వ్యతిరేకత రాలేదు. ఎందుకంటే అక్కడ నిరుద్యోగం తాండవిస్తోంది. వలసలు పెరిగాయి. ఆయిల్ నిల్వలు ఉన్నా ఎదగడానికి లేకుండ ఆపోయింది. చావెజ్ కాలంలో చమురుశుద్ధి రంగంలోకి దిగిన అమెరిక్ ఆయిల్ కంపెనీలను తన్ని తగలేశారు. ఈ కారణంగా అక్కడ తినడానికే తిండి లేకుండా పోయింది.సంచుల్లో కరెన్సీ పట్టుకెళితు సంచెడు కూరగాయులుకూడా దొరకని పరిస్థితి దాపురించింది. అందుకే అమెరికా దాడిని ప్రజలు స్వాగతించారు. ఇకపోతే వెనెజులాతో చైనా వ్యాపారం జోరుగా సాగుతోంది. చైనా యెన్‌లో వ్యాపారం సాగిస్తోంది. ఇది అమెరికాకు గిట్టడం లేదు. చైనాను కట్టడి చేయడానికి అమెరికా వెంటనే రంగంలోకి దగడం వెనక ఇదే కారణమని అంతర్జాతీయ పరిణామాలు చెబుతున్నాయి. ప్రపంచంలో ఆర్థికంగా ఎదిగిపోతున్న చైనాను కట్టడి చేయడానికి అమెరికా వెనిజులాను ఎరగా చేసుకుందన్న వాదన ఉంది. అందులో భాగంగానే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోపై నార్కో టెర్రరిస్టు అనే అభియోగం మోపి అమెరికా కిడ్నాప్ చేసింది. అమెరికా వెనిజులాలో లభించే చమురు, ఖనిజ నిక్షేపాలను తన ఆధీనంలోకి తీసుకునేందుకు మాత్రమే ఈ దురాక్రమణకు పాల్పడలేదు. గత రెండు దశాబ్దాలుగా లాటిన్ అమెరికాపై చైనా పట్టు పెంచుకుంటోంది. లాటిన్ అమెరికా దేశాలకు చైనా ఆర్థిక సహాయమందిస్తోంది. దక్షిణ అమెరికాపై చైనా పట్టును సడలించడానికే అమెరికాఅధ్యక్షుడు ట్రంప్ ఇలాంటి బెదిరిం పులకు దిగుతున్నారు. ఆర్థిక కోణంలో పరిశీలిస్తే.. వెనిజులాలో లభించే క్రూడాయిల్ ఎక్కువశాతం చైనాకు ఎగుమతి అవుతుంది. ఇదే కాకుండా బొగ్గు, బంగారం, బాక్సైట్, ఐరన్ ఎగుమతులు కూడా రెండు దశాబ్దాల్లో చైనాకు విపరీతంగా వియత్నాం ఎగుమతుల్ని పెంచుకుంది. 2000 సంవత్సరంలో ఒక శాతం కన్నా తక్కువగా ఉన్న ఖనిజ ఎగుమతులు అధికారిక లెక్కల ప్రకారం 2018 నాటికి 28 శాతం మేర వియత్నాం ఎగుమతులు పెరిగాయి. రెండు దశాబ్దాల కాలంలోనే.. లాటిన్ అమెరికా దేశాలకు చైనా రుణాలు ఇవ్వడం కూడా పెరిగింది. 1990ల మధ్యలో వెనిజులా దిగుమతులలో అమెరికా వాటా చాలా సంవత్సరాలు స్థిరంగా 40 శాతం మార్కును దాటింది. 2023లో వెనిజులా దిగుమతుల్లో అమెరికా వాటా కేవలం నాలుగో వంతు మాత్రమే. అయితే అదే కాలలో చైనా వాటా మూడింట ఒకవంతుగా ఉంది. గత రెండు దశాబ్దాలలో చైనా వాటా పెరిగింది. అమెరికా నుంచి దిగుమతుల వాటా దాదాపు సగానికి తగ్గింది. ఇదే క్రమంలో డాలర్ల నుంచి చైనా యెన్‌ల రూపంలో మారకం సాగుతోంది. వెనిజులాపై ఆంక్షల నేపథ్యంలో ఈ పద్ధతిని చైనా ఎంచుకుంది. ఇది కూడా అమెరికా ఆగ్రహానికి కారణమయ్యింది. చైనా 2001–2023 మధ్యకాలంలో లాటిన్ అమెరికా దేశాలకు చైనా నుంచి పెట్టుబడుల పరంగానూ, సహాయంగానూ, రుణాలు, గ్రాంట్ల రూపంలో మొత్తం 300 బిలియన్ డాలర్లకు పైగా అందించింది. అందులో మూడింట ఒకవంతు కంటే ఎక్కువ సుమారు 106 బిలియన్ డాలర్లను వెనిజులాలో చైనా పెట్టుబడి పెట్టింది. లాటిన్ అమెరికాలోనే కాకుండా.. వెనిజులా ప్రపంచవ్యాప్తంగా చైనా నుంచి సహాయం పొందుతున్న నాల్గవ అతిపెద్ద దేశం అని ఎయిడ్ డేటా అనే పరిశోధనా ప్రయోగశాల గణాంకాలు చెబుతున్నాయి. వెనిజులా దిగుమతులతో.. చైనా 170కి పైగా ప్రాజెక్టులను నిర్మించుకుంది. వెనిజులాలో చైనా 26 శాతం కంటే ఎక్కువ విద్యుత్, మైనింగ్ ఇతర సంబంధిత పరిశ్రమల వంటి కీలక రంగాల్లో పెట్టుబడి పెట్టినట్లు ఈ గణాంకాలు తెలిపాయి.


## కలిపి తీసుకుంటే కష్టమే!



మాంసాహారం, పాలు ఒకేసారి తీసుకోవద్దని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం మాంసాహారం-పాలను 'విరుద్ధ ఆహారం'గా పిలుస్తారట. అందుకే, ఈ రెండిటినీ కలిపి తీసుకుంటే లేనిపోని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తు న్నారు. ఇందుకు కారణాలు చెబుతూ.. మాంసం వేడిచేసే గుణాన్ని కలిగి ఉంటుంది. పాలు చలువ చేస్తాయి. కాబట్టి, ఈ రెండూ కలిపి తీసుకున్నప్పుడు జీర్ణ ప్రక్రియలో అసమతుల్యత ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా.. పాలు, మాంసంలో ప్రొటీన్స్, పోషకాలు రెండూ అధిక మొత్తంలో ఉంటాయి. కాబట్టి, ఈ రెండిటినీ కలిపి తీసుకోవడం వల్ల.. జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. కడుపు ఉబ్బరం, అజీర్ణం, కడుపు నొప్పి, వికారం లాంటి సమస్యలు ఎదురవుతాయని అంటున్నారు. కొందరిలో గుండెల్లో మంట కూడా వస్తుందట. కాబట్టి, మాంసాహారం తిన్న తర్వాత కనీసం 2నుంచి 3 గంటల విరామం ఇచ్చిన తర్వాతే పాలు తాగడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక చేపలు తిన్న తర్వాత పాలుతాగితే.. తీవ్రమైన అలర్జీలు వచ్చేఅవకాశంఉందని అంటున్నారు.


# నెలల శిశువుకు కడుపునొప్పి వస్తుందా?

మా పాపకు రెండున్నర నెలలు. చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఐదున్నర కిలోల బరువు ఉంది. తల్లి పాలే పడుతున్నాం. పాప మల విసర్జన సరిగా లేదు. పోయిన వారంలో నాలుగు రోజుల తర్వాత విరేచనం అయింది. అయిదు రోజులు గడిచినా ఈ వారంలో ఇంకా విరేచనం కాలేదు. పిల్లల డాక్టర్‌కి చూపిస్తే.. కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. రెండు రకాల ఓరల్ డ్రాప్స్ (చుక్కల మందు) ఇచ్చారు. పాలు ఎక్కువగా తాగకుండా చూసుకోమని సలహా ఇచ్చారు. ఆ మందులు వాడిన మరుసటి రోజు కూడా మోషన్ కాలేదు. అప్పుడప్పుడూ ఏడుస్తున్నది. కడుపు నొప్పితో ఏడుస్తుందేమోనని అనుకుంటున్నాం. అడపాదడపా పాలు తాగిన తర్వాత వాంతి చేసుకుంటున్నది. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? బరువు చక్కగానే ఉంది. తల్లిపాలు మాత్రమే తాగే పిల్లలు రోజూ మోషన్‌కి పోకపోతే కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇలాంటి పిల్లలకు రోజుకు అయిదుసార్లు విరేచనాలు కావొచ్చు. అయిదు రోజులకు ఒకసారి విరేచనం కావొచ్చు. రెండూ సాధారణమే. కాకపోతే బిడ్డ కొద్దిగా అసౌకర్యంగా ఉన్నట్టు, ఇబ్బందిపడుతున్నట్టు చెప్పారు. అది బహుశా కడుపులో గ్యాస్ ఏర్పడడం వల్ల కలిగి ఉండొచ్చు. ఆరు నెలలలోపు శిశువులకు ఈ సమస్య కూడా సాధారణమైనదే. మీకు డాక్టర్లు ఓరల్ డ్రాప్స్ ఇచ్చారని చెప్పారు. అవి గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అడపాదడపా వాడొచ్చు. ఇంకో ముఖ్యమైన విషయం.. తల్లిపాలు ఇచ్చిన తర్వాత భుజం మీద వేసుకుని ఓ పదిహేను, ఇరవై నిమిషాలు నిటారుగా ఉంచుకుంటే.. తేన్పులు వచ్చి రిలీఫ్‌గా ఉంటుంది.కాకపోతే తల్లి భోజనంలో మసాలాలు, కారాలు తగ్గించుకోవాలి. అలాగని పథ్యాలు చేయాల్సిన అవసరం లేదు. ఆరు నెలల్లోపు పిల్లలు పాలు తాగిన తర్వాత వాంతులు చేసుకుంటే పెరుగులా రావడం సహజం.



సాధారణంగా వాంతి అయినప్పుడు అన్నవాహిక నుంచి ఆహారం బయటపడుతుంది. కానీ ఆరు నెలల్లోపు పిల్లలకు వాంతి అయితే జీర్ణాశయానికి చేరిన పాలు తిరిగి బయటికి వస్తాయి. చిన్న వయసు శిశువుల్లో అన్న వాహికకు, జీర్ణాశయానికి మధ్యన ఉండే కండరాలు బలహీనంగా ఉంటాయి. కాబట్టి జీర్ణాశయం చేరిన పాలు తిరిగి అన్నవాహికలోకి వస్తాయి. అందుకే వాంతి అయినప్పుడు బయటపడిన పాలు పెరుగులా ఉంటాయి. ఆ వాంతులకు కంగారుపడకండి. బిడ్డ బరువు సరిగా ఉండి, హుషారుగా ఉంటే దీనికి ప్రత్యేకమైన చికిత్స అవసరమే లేదు. ఒకవేళ బిడ్డకు వాంతులు ఆకుపచ్చ రంగులో అయితే, పొట్ట అకస్మాత్తుగా ఉబ్బితే వెంటనే డాక్టర్‌కి చూపించాలి. సాధారణంగా వచ్చే పాలలాంటి, పెరుగులాంటి వాంతులకు కంగారుపడాల్సిన అవసరం లేదు. మీ బిడ్డకు గ్యాస్ వల్ల పేగుల్లో నొప్పి కలిగి ఉండి ఉంటుంది. ఇప్పటికే పిల్లల వైద్యులు చూశారు. కాబట్టి కంగారు పడకండి.

# ఈ నడక గుండెకు భరోసా



తిండి కలిగితే కండ కలదోయ్ అన్నట్టే, కొవ్వు పెరిగితే.. గుండె జబ్బు కలుగోయ్ అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. గుండె ఆరోగ్యానికీ, శరీరంలో కొవ్వుకీ సంబంధం ఉంది. గుండెలో ఉన్న సమస్యకు, శరీరంలో ఉన్న కొవ్వుకి ఒకటే పరిష్కారం. వ్యాయామం. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు. గుండె ఆరోగ్యాన్ని పెంచుకునే వ్యాయామం చేస్తూ.. కొవ్వుని తగ్గించేలా కొన్ని నియమాలు పాటిస్తే డబుల్ బెనిఫిట్స్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అదేమిటంటే.. ట్రెడ్ మిల్ మీద కేవలం పరుగే కాక నడకనూ అలవాటు చేసుకోవాలి. రోజువారీగా ట్రెడ్ మిల్ మీద పరుగెత్తే సమయంలో పది నుంచి పన్నెండు శాతం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఈ సమయాన్ని నడకకు కేటాయించాలని చెబుతున్నారు. ఆ నడక కూడా ట్రెడ్ మిల్ మీదే. నడకలోనూ వేగం ఉండాలన్నది నిబంధన. గంటకు రెండు నుంచి మూడు మైళ్ల వేగంతో ట్రెడ్ మిల్ స్పీడ్‌ని సెట్ చేసుకోవాలి. ఈ వేగంతో 30నిమిషాల నుంచి 60 నిమిషాల పాటు వాక్ చేయాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే శరీరంలోని కొవ్వు నిల్వలు కరిగిపోవడంతోపాటు రక్తంలోని గ్లూకోజ్ అంతా ఖర్చవుతుందట. కొత్తగా కొవ్వు పేరుకునేకి ఆస్కారమూ ఉండదు. సుదీర్ఘమైన స్పీడ్‌వాక్ గుండె వేగాన్ని మెరుగుపరుస్తుంది. రెండు సమస్యలూ ఉన్నట్లయితే.. మీ వ్యక్తిగత ఫిట్‌నెస్ ట్రైనర్ సలహా తీసుకున్న తర్వాతే ట్రెడ్ మిల్ మీద ముందడుగు వేయండి.


# పచ్చసొన వద్దనకండి!

గుడ్డులో పచ్చసొన తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందని, అది గుండెకు ప్రమాదమని భావించి చాలామంది దాన్ని పకన పెడతారు. మరీ ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు గుడ్డులోని తెల్లసొనను మాత్రమే తిని పచ్చసొనను పారేస్తుంటారు. కానీ పచ్చసొనతో కలిపి తింటేనే గుడ్డు సంపూర్ణ ఆహారం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం తెల్లసొన మాత్రమే తినడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎకువ. తెల్లసొన ఒక ఇన్‌ఫ్లమేటరీ ప్రొటీన్. దీనికి శరీరంలో మంటను కలిగించే స్వభావం ఉంటుంది. దీన్ని పచ్చసొనతో కలిపి తిన్నప్పుడు మాత్రమే అది సమతుల్యమైన, సంపూర్ణ ఆహారంగా మారుతుంది. పచ్చసొనలో కొలెస్ట్రాల్ ఉంటుందనే కారణంతో దాన్ని అందరూ విలన్‌గా చూస్తారు. కానీ, వాస్తవానికి గుడ్డులోని మెజారిటీ పోషకాలు అందులోనే ఉంటాయి. తెల్లసొనతో పోలిస్తే పచ్చసొనలో విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుషలంగా లభిస్తాయి. మన శరీరానికి అవసరమైన కొలెస్ట్రాల్‌లో దాదాపు 85 శాతం మన కాలేయమే సొంతంగా తయారు చేస్తుంది. కేవలం 15 శాతం మాత్రమే మనం తినే ఆహారం ద్వారా అందుతుంది. శరీరం తనంతట తానుగా తయారు చేసుకునేది ఆరోగ్యానికి ఎప్పుడూ



హానికరం కాదు. కణాల నిర్మాణం, హార్మోన్ల ఉత్పత్తి, మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి మెరుగుపడటానికి కొలెస్ట్రాల్ ఎంతో కీలకంగా వ్యవహరిస్తుంది. ఆరోగ్యంగా ఉండాలంటే పచ్చసొనను విస్మరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు బరువు తగ్గాలనుకున్నా, మీ కండరాలు దృఢంగా తయారవ్వాలన్నా గుడ్డును పచ్చసొనతో కలిపి పూర్తిగా తినడమే శ్రేయసరం. మారెట్లో దొరికే కృత్రిమ ప్రొటీన్ల కంటే ప్రకృతి సిద్ధంగా ఉత్పత్తి అయ్యే గుడ్డు ద్వారా లభించే పచ్చసొన ఎంతో మేలు చేస్తుంది.

# డిజిటల్ భద్రతే ముఖ్యం!



నేటి డిజిటల్ ప్రపంచంలో.. సోషల్ మీడియా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగమై పోయింది. వినోదంతోపాటు కమ్యూనికేషన్, సృజనాత్మకతలోనూ ఇదే కీలకంగా మారింది. అయితే, పెద్దల వరకు సత్ఫలితాలను అందిస్తున్న సామాజిక మాధ్యమం.. పిల్లలకు లేనిపోని చిక్కులు తెచ్చిపెడుతున్నది. ఈ క్రమంలో 'డిజిటల్ భద్రత'పై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. సోషల్ మీడియా వినియోగానికి '13 ఏళ్లు' అనేది చట్టపరమైన కనీస వయస్సు. అయినప్పటికీ, చాలా సందర్భాల్లో వయసు కన్నా.. అవగాహనే ముఖ్యమని పరిశీలకులు చెబుతున్నారు. దాంతోపాటు భావోద్వేగ, సామాజిక సంసిద్ధత కూడా ఉండాలని అంటున్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. మూడు నుంచి 17 ఏళ్ల పిల్లలలో 99శాతం మంది ప్రతిరోజూ ఎంతోకొంత సమయం స్క్రీన్‌పై గడుపుతున్నారట. ఇక ఆన్‌లైన్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ప్లాట్‌ఫామ్‌గా గుర్తింపున్న యూట్యూబ్‌ను 89శాతం మంది పిల్లలు ఉపయోగిస్తున్నారట. అంతేకాకుండా.. 13 ఏళ్లకన్నా తక్కువ వయసు ఉన్న పిల్లల్లో ఎక్కువ మందికి కనీసం ఒక సోషల్ మీడియా యాప్, సైట్లో సొంత ప్రొఫైల్ ఉన్నదట. ఐదు నుంచి ఏడేళ్ల వయస్సు గల పిల్లల తల్లిదండ్రులలో.. మూడింట ఒకవంతు మంది తమ బిడ్డకు సోషల్ మీడియా ప్రొఫైల్ ఉన్నట్లు చెప్పారు. అదే ఎనిమిది నుండి 11 ఏళ్ల పిల్లలలో.. 60శాతం మంది సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారట. దీన్నిబట్టి.. టీనేజర్లు, ప్రీ టీనేజర్లలో అధికశాతం మంది సోషల్ మీడియాను వాడుతున్నట్లు తేలింది. వీరిలో చాలామంది వినోదం కోసం,


చదువుకు సంబంధించిన విజ్ఞానాన్ని పెంచుకోవడానికే యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. అదే సమయంలో సోషల్‌మీ డియాపై అవగాహన లేమితో లేనిపోని సమస్యల్లో కూరుకుపోతు న్నారు. సైబర్ బెదిరింపులు, గోప్యత, డేటా చోరీలాంటి వాటికి గురవుతున్నారు.

భద్రత, బాధ్యతే ముఖ్యం..: పిల్లలకు ఆన్‌లైన్ భద్రతతోపాటు బాధ్యతగా వ్యవహరించడంపై అవగాహన కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ భద్రత, ఫొటోలు, వీడియోలను పంచుకోవడంతోపాటు హానికరమైన కంటెంట్‌ను గుర్తించడంలో వారికి సహాయపడాలి. దీనివల్ల సైబర్ దాడులు, ఏఐ మార్ఫింగ్ ప్రమాదాలను పిల్లలు అర్థం చేసుకుంటారు. అప్పుడే, సురక్షితమైన ఎంపికలు చేసుకోవడానికి సన్నద్ధమవుతారు. సామాజిక మాధ్యమాల్లోనూ సురక్షితంగా ఉంటారు. అంతేకాకుండా.. సోషల్ మీడియాను సురక్షితంగా ఉపయోగించినప్పుడే.. దాని నుంచి ప్రయోజనాలను పొందగలుగుతారు. లేకుంటే.. పిల్లలు క్రూరమైన, హింసాత్మక, లైంగికపరమైన చిత్రాలను చూసే అవకాశం ఉంటుంది. ఇది వారి ప్రవర్తనపై దుష్ప్రభావం చూపుతుంది. ఇక చాలా సందర్భాల్లో తెలియకుండా తీసిన ఇబ్బందికరమైన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్నీ పంచుకుంటున్నారు. ఫలితంగా, సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు.

ఈ సూచనలు పాటించాల్సిందే!: పాస్‌వర్డ్‌లు, లాగిన్ వివరాలను గోప్యంగా ఉంచాలి. వాటిని స్నేహితులతోనూ పంచుకోవద్దు.

పబ్లిక్ వై-ఫైకి కనెక్ట్ అయినప్పుడు సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ ఖాతాలను ఉపయోగించవద్దు. ఇతర కంప్యూటర్లు, గ్యాడ్జెట్లను ఉపయోగించిన తర్వాత..అన్ని ఖాతాల నుంచీ తప్పకుండా లాగ్ అవుట్ అవ్వాలి. అన్నిటికన్నా ముఖ్యంగా.. పాప్ అప్‌లపై క్లిక్ చేయవద్దు. అవి అశ్లీలత, స్కామ్ సైట్‌లకు దారితీయవచ్చు. తెలిసిన వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను మాత్రమే అంగీకరించాలి. ఆన్‌లైన్‌లో ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే.. స్క్రీన్‌షాట్ తీసుకొని, వాటి గురించి పెద్దలతో మాట్లాడాలి.

# కావాల్సినంత క్యాల్షియం




క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుందని చాలామంది పిల్లలకి ఉదయాన్నే పాలు తాగిస్తుంటారు. పిల్లలేకాదు పెద్దవారు కూడా క్యాల్షియం కోసం పాలు తాగుతుంటారు. వయసు పెరిగేకొద్దీ ఎముకల్లో బలం తగ్గుతుంది కాబట్టి వృద్ధులను కూడా పాలు తాగమని చెబుతుంటారు. క్యాల్షియం సప్లిమెంట్స్ కూడా వాడుతుంటారు. పాలతోపాటు ఈ ఆహార పదార్థాలకు మీ డైట్‌లో చోటివ్వండి. కావాల్సినంత క్యాల్షియం లభిస్తుంది. పాలు తాగకపోతే క్యాల్షియం అందదని చాలామంది అభిప్రాయం. కానీ, అది వాస్తవం కాదు. 100 మి.లీ. ఆవుపాల ద్వారా 120 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. అదే 100 మి.లీ. గేదెపాలు తీసుకుంటే.. 210 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. ఇంతకు రెట్టింపు క్యాల్షియం అందించే పదార్థాలు ఉన్నాయి. అవేంటంటే..

బెస్ట్ సోర్స్: ఉలవల్లో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. 100 గ్రా. ఉలవల ద్వారా దాదాపు 290 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. నాన్ వెజ్, పాలు తీసుకోలేని వారికి ఉలవలతో క్యాల్షియం అవసరాలు తీరిపోతాయి.

ఎముకలు ఉక్కులా: రాగులు కూడా క్యాల్షియం రిచ్ సోర్స్. దాదాపు 100 గ్రా. రాగుల ద్వారా 350 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. రాగి జావ, రాగి ఇడ్లీ, దోశ, రొట్టె ఇలా రకరకాల రూపాల్లో రాగులు టేస్ట్ చేయొచ్చు. వీటి వల్ల ఎముకలు ఉకులా మారతాయి.

అంతకుమించి: 100 గ్రా. తోటకూరలో దాదాపు 400 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. ఆకుకూరల్లో క్యాల్షియం సమృద్ధిగా అందించే వాటిలో తోటకూర ముందువరుసలోఉంటుంది.

రుచికి రుచి: 100గ్రా. మునగాకులో 440 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. మునగాకు పప్పు,తాలింపు, పొడి ఇలా రకాలుగా తినొచ్చు.

సూపర్‌ఫుడ్: అవిసె ఆకులు కూడా క్యాల్షియాన్ని అందించే సూపర్ ఫుడ్‌గా చెబుతుంటారు. దాదాపు 100 గ్రా. అవిసె ఆకుల్లో 1200 మి.గ్రా. కాల్షియం ఉంటుంది. ఎలాగైనా తినొచ్చు: 100 గ్రా. నల్లనువ్వుల్లో 1450 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది.

# కిచ్‌కిచ్ తగ్గించుకోండి ఇలా

గొంతులో కిచ్‌కిచ్ ఉంటే ఇబ్బందే. మాటిమాటికీ గొంతు సవరించుకోవడం, కఫాన్ని ఉమ్మివేయడం కష్టమే. కొంతమందైతే కఫాన్ని మింగేస్తారు కూడా. అది చాలా ప్రమాదకరం. గొంతులో గరగరగా ఉందంటే మన శరీరంలోకి ప్రవేశించే బ్యాక్టీరియాలతో వ్యాధి నిరోధక శక్తి పోరాడుతున్నట్లు అర్థం. వ్యాధి నిరోధక శక్తి ఓడిపోతున్నప్పుడు మ్యూకస్ (కఫం లేదా శ్లేష్మం) ఏర్పడుతుంది. అది గొంతుకు అడ్డం పడుతుంది. జలుపు, జ్వరం, అలెర్జీలు, కాలుష్యం, పొగ వంటివి గొంతు గరగరకుదారితీస్తాయి.

దీనివల్ల వచ్చేదగ్గు రెండువారాల కంటే ఎక్కువ ఉంటే ప్రాణాంతకమైన క్షయ వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే మనం గొంతులో కిచ్‌కిచ్ అంతు చూద్దాం. అందుకు మందులతో పనిలేదు. మన వంటింట్లో ఉంటే చిట్కాలేంటో చూద్దాం.

పసుపు, పాలు : గోరు వెచ్చని పాలలో అర టీస్పూన్ పసుపు కలిపి తాగాలి. కాస్త నెయ్యి కూడా వేసుకోవచ్చు. గొంతులో గరగర మాయమై గొంతులో హాయిగా ఉంటుంది. అల్లం, దాల్చిన చెక్క : అల్లాన్ని పేస్ట్ చేసి, దాల్చిన చెక్కను పొడి చేసి, వాటితో టీపొడి కలిపి టీ పెట్టుకొని తాగేయాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది. కాస్త తేనె కూడా కలుపుకోవచ్చు.



అల్లం టీ: అల్లంలో బ్యాక్టీరియాలను చంపే గుణాలున్నాయి. గొంతులో మంటను తగ్గించే లక్షణాలున్నాయి. కాబట్టి అల్లాన్ని మెత్తగా నూరి టీలో కలిపి ఐదు నిమిషాలు మరిగించి తాగితే గొంతులో కిచ్‌కిచ్ మాయం.పుదీనా టీ : పుదీనా ఆకుల్ని నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించి, ఆ నీటిని తాగేయాలి. అంతే.. మ్యూకస్ పెట్టే బెడద సర్దుకోవాల్సిందే.చామంతి టీ : ఇది పెద్దగా తెలియకపోవచ్చు. నిజానికి ఇది కూడా బాగా పనిచేస్తుంది. కొన్ని చామంతి రేకుల్ని నీటిలో వేసి మరిగించి తాగేయాలి. ఈ టీ బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. దీనిలో తేనె కూడా కలుపుకోవచ్చు.

# గంటకు 12 నిమిషాలు మాత్రమే యాడ్స్



### టీవీ ప్రసార సంస్థలకు ట్రాయ్ ఆదేశాలు జారీ
### ఆదాయం తగ్గి మనుగడ కష్టమవుతుందని
### టీవీ చానళ్ల యాజమాన్యాల ఆందోళన

చెన్నై, : టెలివిజన్ ప్రసారాల కంటెంట్‌ని నియంత్రించే ప్రయత్నంలో భాగంగా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) టెలివిజన్ ప్రసార సంస్థలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. గంటకు 12 నిమిషాలకు మించి వ్యాపార ప్రకటనలను ప్రసారం చేయరాదన్న నిబంధనకు తప్పనిసరిగా కట్టుబడి ఉండాలని ట్రాయ్ ఆదేశించింది. ఈ వ్యవహారం కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ పరిమితి నిబంధనను అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ నిబంధన ఇప్పటికీ అమల్లో ఉందని, దీన్ని ప్రసార సంస్థలు పాటించక తప్పదని ట్రాయ్ అధికారి ఒకరు తెలిపారు. టీవీ ప్రసార సంస్థలపై కఠిన చర్యలు వద్దని మాత్రమే ఢిల్లీ హైకోర్టు ఆదేశించి స్టే ఇచ్చిందే తప్ప గంటకు 12 నిమిషాల వ్యాపార ప్రకటనల పరిమితిపై ఎటువంటి స్టే ఇవ్వలేదని ఆ అధికారి చెప్పారు. ట్రాయ్ నిబంధనల ప్రకారం కూడా గంటకు 10 నిమిషాల వాణిజ్య ప్రకటనలు, మరో 2 నిమి షాలు సొంత చానెల్ ప్రచారానికి సంస్థలు సమయం కేటాయించాల్సి ఉంటుంది. ట్రాయ్ కొత్త నిబంధనలు టెలివిజన్ ప్రసార మీడియాకు చెందిన ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. చందాలు, వాణిజ్య ప్రకటనల ఆదాయం పైనే కంపెనీలు మనుగడ సాగిస్తున్నాయి. ఇలాంటి సమయలో వాణిజ్య ప్రకటనల సమయాన్ని తగ్గించడం వల్ల ఆదాయం మరింత పడిపోతుందని సీనియర్ బ్రాడ్‌కాస్టింగ్ ఎగ్జిక్యూటివ్ ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు.

# 25 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతి

**తిరుమల,తెలంగాణ దిశ :** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి వైభవాన్ని ఈశాన్య భారతదేశంలో మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. గువాహటి నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం నిర్మాణం సాకారం కానుంది. అసోంలో అద్భుత దేవాలయ నిర్మాణానికి అక్కడి ప్రభుత్వం సహకారం అందించనుంది. ఆలయ నిర్మాణానికి తొలుత నిర్ణయించిన 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం నిర్ణయిం చింది. అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సంప్రదింపుల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడిం ది. గువాహటి సమీపంలోని కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం గతంలోనే అంగీకారం తెలిపింది. అయితే డిసెంబర్ 7న అస్సాం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది టీటీడీ ఛైర్మన్‌కు లేఖ రాస్తూ గువాహటిలోని గర్భుక్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న శ్రీవారి ఆలయం మరియు సాంస్కృతిక సముదాయం నిర్వాహకుల సూచనలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ శ్రీ వేంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని అస్సాంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్ లేదా డిబ్రూగఢ్ నగరాల్లో ఏర్పాటు చేయాలని అస్సాం సీఎం అదనపు ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ విషయా న్ని టీటీడీ చైర్మన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఈనెల 18న అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మకు లేఖ రాశారు. దేశంలోని ప్రతి రాష్ట్రం మరియు కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం ఒక శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని స్థాపించడం ద్వారా హిందూ సనాతన ధర్మం, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి మహిమను విస్తరించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు టీటీడీ నిబద్ధతగా ఆ లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్ని అస్సాం ముఖ్యమంత్రికి గుర్తు చేస్తూ, సిల్చార్ లేదా డిబ్రూగఢ్ బదులుగా అస్సాం రాజధాని గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమి కేటాయించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈశాన్య భారతదేశానికి గువాహటి ప్రధాన కేంద్రంగా ఉన్నందున, భక్తుల సౌకర్యాలు, నిత్య అన్నదానం వంటి ధార్మిక కార్యక్రమాలతో కూడిన దివ్యక్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి సుమారు 25 ఎకరాల భూమిని కేటాయించాలని సిఫార్సు చేశారు. అస్సాం ప్రభుత్వం ఆర్థిక సహకారం కూడా అందించాలని ఏపీ సీఎం తన లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన సూచనలకు సానుకూలంగా స్పందించిన అస్సాం ముఖ్యమంత్రి గువాహటిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అలాగే ప్రతిపాదిత ప్రాజెక్టు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందించేందుకు అంగీకరిం చారు. ఈ అంశాన్ని సౌహార్దపూర్వకంగా పరిష్కరించినందుకు ఆంధ్ర ప్రదేశ్ , అస్సాం రాష్ట్రాల ముఖ్యమంత్రులకు టీటీడీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. భూమి కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలను పూర్తి చేసి,ఈశాన్య భారతదేశంలో తొలి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అస్సాం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని తెలియజేశారు.

# సరిహద్దులు దాటుతున్న సబ్సిడీ బియ్యం..!

**జయశంకర్,తెలంగాణ దిశ :**ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన సన్నబియ్యం పథకం స్మగ్లర్లకు వరంలా మారింది. సబ్సిడీ బియ్యం సరిహద్దులు దాటుతున్న రాష్ట్ర సరిహద్దుల్లోని అధికారుల్లో చలనం లేదు. కాళ్ళు లేని బియ్యం స్మగ్లర్ యదేచ్ఛగా పేదల బియ్యంను లారీల్లో తరలిస్తున్న కండ్లున్న అధిక్షరులకు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నింస్తున్నారు. పిడిఎస్‌రైస్ అక్రమ సరఫరాలో సమూల మార్పులు తీసుకొచ్చిన అక్రమ వ్యాపారం మాత్రం ఆగడం లేదు. పొరుగు రాష్ట్రాల్లో దొడ్డు బియ్యానికి ఎక్కువ డిమాండ్ ఉండడంతో ఇంతకాలం స్మగ్లర్లు ఇష్ట రాజ్యాంగా నడిపింది. అయితే రేషన్ షాపుల ద్వారా దొడ్డు బియ్యానికి బదులుగా సన్నబియ్యం సరఫరా చేసినట్లయితే లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటారని భావించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందులో భాగంగా సన్న బియ్యం సరఫరాచేయడం మొదలుపెట్టింది. ఆహార భద్రతల కార్డులు ఉన్నవారికి సన్న బియ్యం సరఫరా చేస్తుండడంతో అవి దారి మల్లె అవకాశం ఉండదని వేసిన అంచనాలు మహారాష్ట్రకు చెందిన ఒక బడా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారి తలకిందుల చేసి ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించాడు. గతంలో 18రూపాయలకు కిలో చొప్పున దొడ్డుబియ్యం కొనుగోలు చేసిన అక్రమ వ్యాపారస్తులు సన్నబియాన్ని మాత్రం 24రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నట్టుగా సమాచారం. దొడ్డు బియ్యం స్మగ్లర్ల ద్వారా రవాణా కాగా ఇప్పుడు 40 శాతం వరకు పిడిఎస్ రైస్ అక్రమ రవాణా అవుతున్నట్టుగా సమాచారం. సన్న బియ్యం సరఫరా చేస్తున్నప్పటికీస్మగ్లింగ్ జరుగుతుందన్న సమాచారం అందుకున్న తెలంగా ణసివిల్ సప్లై విజిలెన్స్ విభాగం అధికారులు మొదట్లో దాడులు చేశారు.

# సమాజం బాగుపడాలని





సమాజం పట్ల కొంతమంది ఎంతో బాధ్యతగా ఉంటారు. తమిళనాడు తిరుచ్చికి చెందిన విజయ్ కుమార్ అలాంటివారే. చనిపోయిన వారికి గౌరవం, జీవించి వున్న వారికి జ్ఞానం, సంస్కృతిని కాపాడడం ఆయన దినచర్యల్లో భాగం. ఒకే వ్యక్తి ఇన్ని రకాల పనులు చేయడం చూస్తే ఆశ్చర్యమేస్తుంది. కానీ విజయ్ కుమార్ దాన్ని సాధ్యం చేసి చూపిస్తున్నారు. ఆయన అడుగుజాడల్లో భార్య, కూతురు కూడా కలిసి నడవడం చూసి ఎంతోమంది స్ఫూర్తిని పొందుతున్నారు.

విజయ్ కుమార్‌కి 50 ఏళ్లు. ఆయన తన 25 ఏళ్ల నుండే పుస్తకాలు సేకరించడం, గ్రంథాలయం నిర్వహించడం విధిగా చేస్తున్నారు. పుస్తకాలు చదువుకోవాలనుకున్న వారికి ఉచితంగా వాటిని పంపిణీ చేస్తారు. గ్రంథాలయానికి వచ్చి చదువుకునే వారి దగ్గర నుండి కూడా ఏవిధమైన రుసుము వసూలు చేయరు.

పుత్తూరులో ఈయన నిర్వహించే గ్రంథాలయంలో 25 వేల పుస్తకాలు ఉన్నాయి. పుస్తకాలని విజయ్ కుమార్ ఎంతలా ప్రేమిస్తారో ఆయన మాటలను బట్టే అర్థమవుతుంది. 'పుస్తకాలు లేని ఇల్లు కిటికీలు లేని గోడ వంటిది. తెరిచిన గ్రంథాలయాలు జైళ్ల గోడలను మూసి వుంచుతాయి. మంచి పుస్తకాలు చదవడం జ్ఞానాన్ని మెరుగుపరుచుకోవడంతో సమానం' వంటి మాటలు తరచూ విజయ్ కుమార్ అంటుంటారు. పుస్తక జ్ఞానాన్ని ప్రజలకు ఇంతలా చేరువ చేస్తున్న అతని కృషికి ప్రశంసలు, అవార్డులు కూడా దక్కాయి.

సాధారణంగా చనిపోయిన వారి ఇంటికి వెళ్లినా, శ్మశానం వరకు వెంట నడిచినా చాలా ఇళ్లల్లో గొడవ చేస్తారు. విజయ్ కుమార్ ఇంట్లో వాళ్లు మాత్రం అలా కాదు. ఆయన భార్య చిత్ర, కూతురు కీర్తన అనాథలకి అతను చేసే అంత్యక్రియల్లో భాగమవుతారు. రోడ్ల మీద, బస్టాండ్‌లు, రైల్వే స్టేషను, నదీతీరాల్లో అనాథలుగా పడిఉన్న శవాలకి విజయ్ కుమార్ ఎంతో శ్రద్ధగా చివరి క్రతువులు నిర్వహిస్తారు. కోవిడ్ సమయంలో కూడా కుటుంబ సభ్యులు కూడా దగ్గరికి రాని మృతదేహాలకు ఈ కుటుంబం అంత్యక్రియలు చేసింది. 'ఈ పని చేస్తున్నందుకు ఎంతోమంది నిందించారు. అయినా మా పని ఎప్పుడూమానలేదు' అని చిత్రచెబుతున్నారు. గ్రంథాలయం, అనాథశవాల అంత్యక్రియలు నిర్వహించే విజయ్ కుమార్‌కి తమిళ సంస్కృతి చిహ్నాలను కాపాడడం చాలా ఇష్టం. పురాతన వస్తు సముదాయాలు నిండిన ఆయన ఇల్లు ఒక చిన్నసైజు మ్యూజియంలా ఉంటుంది. దీనిగురించి ఆయన ఇలా అంటున్నారు. 'తిరుచ్చిలోని అన్ని గ్రామాలు తిరుగుతాను. కొన్ని సార్లు జిల్లా నుండి బయటికి కూడా వెళతాను. నేను సేకరించిన వస్తువులను తమిళం, ఇంగ్లీషు భాషల్లో డాక్యుమెంటరీ కూడా చేశాను. పరిశోధనల కోసం కాలేజీ విద్యార్థులు ఇక్కడికి వస్తుంటారు. పురాతన కాలంలో వాడిన నాగళ్లు, మట్టి కుండలు, ధాన్యం సేకరణ వస్తువులు, వెదురుబుట్టలు, వ్యవసాయరంగంలో వాడే వివిధ పనిముట్లు, నాణేలు, కరెన్సీ కాగితాలు వంటి వన్నీ సేకరిస్తాను' అని విజయ్ కుమార్ చెప్పారు.న్యాయవాద వృత్తిలో ఉన్న చిత్ర, ఎల్ఎల్‌బి చదువుతున్న కీర్తన తమ బిజీ లైఫ్‌లో కూడా విజయ్ కుమార్‌కి అండగా నిలవడం వెనుక ఒకే ఒక్క ఉమ్మడి లక్ష్యం దాగుంది. అది సమాజం పట్ల బాధ్యతగా ఉండడం.

# భారీగా వీసాల రిజెక్ట్...




న్యూఢిల్లీ, : అగ్రరాజ్యం అమెరికా వెళ్లాలి.. డాలర్లు సంపాదించాలి అనేది ఒకప్పుడు సంపన్నుల కల.. కానీ ఇప్పుడు మధ్య తరగతి వారు కూడా అమెరికా వెళ్తున్నారు. అయితే డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక సీన్ మారిపోయింది. వీసా ఆంక్షలు, నిబంధనలతో అమెరికా వెళ్లేందుకు చాలా మంది వెనుకాడుతున్నారు. అయితే ట్రంప్ రాకముందు కూడా పరిస్థితి ఇలాగే ఉంది. 2024లో ప్రపంచ దేశాలకు చెందిన చాలా వీసాలు తిరస్కరణకు గురయ్యాయి. 2024లో అమెరికా బీ1/బీ2 వీసాలు (బిజినెస్, టూరిజం) తిరస్కార రేట్లు ప్రపంచవ్యాప్తంగా భిన్నంగా ఉన్నాయి. లైచెన్‌స్టీన్, మొనాకో వంటి దేశాల్లో 0%తోపాటు, భారత్ 16.32%తో మధ్యస్థ స్థాయిలో ఉంది. ఈ డేటా ఆర్థిక స్థితి, రాజకీయ సంబంధాలు, ఇమ్మిగ్రేషన్ రిస్క్‌లపై ఆధారపడి ఉంది.చాలా అధిక ఆదాయ దేశాలు తక్కువ తిరస్కారాలు ఎదుర్కొన్నాయి. ఇవి స్థిరమైన ఆర్థిక వ్యవస్థలు, తక్కువ ఇమ్మిగ్రేషన్ రిస్క్ కలిగి ఉన్నాయి. తక్కువ ఆదాయ దేశాల వీసాలు ఎక్కువగా తిరస్కరణకు గురయ్యాయి. లైచెన్‌స్టీన్, మొనాకో, నార్త్ కొరియా కు చెందిన ఒక్క వీసా కూడా ఆమోదం పొందలేదు. యూఏఈ 1.46 శాతం, జపాన్ 5.76 శాతం, సౌదీ అరేబియా 7.89 శాతం వీసాలు తిరస్కరణకు గురయ్యాయి.భారత్ 16.32%తో 18వ స్థానంలో ఉంది. యూరప్ దేశాలు (ఫ్రాన్స్ 8.50%, జర్మనీ 10. 02%) కంటే ఎక్కువ కానీ చైనా (25.37%), పాకిస్తాన్ (45.65%) కంటే మెరుగు. భారతీయుల్లో ఐటీ ప్రొఫెషనల్స్, విద్యార్థులు ఎక్కువగా అప్లై చేస్తున్నారు. డాక్యుమెంట్లు, ఆర్థిక నిరూపణలు బలంగా ఉంటే సక్సెస్ రేటు పెరుగుతుంది. సంఘర్షణలు, పేదరికం, ఇమ్మిగ్రేషన్ చరిత్ర కారణంగా కొన్ని దేశాల్లో 50% మించి తిరస్కారాలు జరిగాయి. ఇరాన్ 55.54 శాతం, కెనడా 56.35 శాతం, ఆఫ్ఘనిస్తాన్ 48.89 శాతం, నైజీరియా 46.51 శాతం, పాకిస్తాన్ 45.65 శాతం వీసాలు తిరస్కరణకు గురయ్యాయి. కెనడా వంటి అధిక ఆదాయ దేశం కూడా అధిక రేటు ఉండటం ఆశ్చర్యకరం హెచ్?1బీ వీసాలపై యూఎస్‌కు వెళ్లి బీ1/బీ2 అప్లై చేసే ట్రెండ్ కారణం.వీసా ఇస్తే అమెరికాలోనే స్థిరపడతారనే అనుమానం(భారత్, చైనా వంటి దేశాల్లో ఎక్కువ). ఉద్యోగం, ఆదాయం నిరూణ లేకపోవడం, అసంపూర్ణ పత్రాలు, పారికార్డులు, యుద్ధాలు, అస్థిరణ(ఆఫ్ఘాన్, ఇరాన్) తదితర కారణాలతో అమెరికా వీసాలు తిరస్కరిస్తోంది. స్విట్జర్లాండ్, సింగపూర్ వంటి దేశాలు తక్కువ రేట్లు కలిగి ఉంటే, భారతీయులు బలమైన టైస్ (ఫ్యామిలీ, జాబ్) చూపించాలి. ఈ డేటా అమెరికా వీసా పాలసీల ప్రపంచ డైనమిక్స్‌ను తెలియజేస్తుంది. భారత్ మెరుగైన స్థానంలో ఉన్నప్పటికీ, మరింత చైతన్యం అవసరం.

# ఇండియా వైపు అమెరికన్ కంపెనీలు

ఒకప్పుడు అమెరికా కంపెనీలు భారతదేశంలో పెట్టుబడి పెట్టడానికి అంతగా ఆసక్తిని చూపించేవి కాదు. ఒకవేళ పెట్టుబడులు పెట్టినప్పటికీ అనేక రకాల షరతులతో ఇక్కడికి వచ్చేవి. మనదేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడకపోవడం వల్ల విదేశీ పెట్టుబడిదారులలో నమ్మకం ఉండేది కాదు. దీంతో కంపెనీలు ఏర్పాటు కాకపోవడంతో దేశానికి అంతగా ఆదాయం ఉండేది కాదు. 2014 నుంచి ఇప్పటివరకు దేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడటం వల్ల పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగింది. దీనికి తోడు ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు కంపెనీలకు అనుకూలంగా ఉంటున్నాయి. ముఖ్యంగా అమెరికన్ కంపెనీలు భారతదేశంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి.అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ కు ఏ మాత్రం ఇష్టం లేదు. అందువల్లే భారత్ మీద నిత్యం చిమ్ముతూనే ఉన్నాడు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టకుండా అమెరికా కంపెనీలను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నాడు. 145 కోట్ల వినియోగదారుల మార్కెట్ ఉన్న భారతదేశంలో పెట్టుబడులు పెట్టకపోతే తమకు లాభాలు రావని అమెరికన్ కంపెనీలు భావించి.. మనదేశంలో భారీగా పెట్టుబడి పెడుతున్నాయి. మైక్రోసాఫ్ట్ నుంచి మొదలు పెడితే అమెజాన్ వరకు అన్ని కంపెనీలు భారతదేశానికి క్యూ కదుతున్నాయి.అమెజాన్ ఇప్పటికే భారత దేశంలో విస్తృతంగా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది.. మరో మూడు లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. మైక్రోసాఫ్ట్ కూడా 1,50,000 కోట్లతో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది. గూగుల్ కూడా అత్యంత విలువైన డాటా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. భవిష్యత్తు కాలంలో ఇంకా ఎక్కువ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని గూగుల్ ప్రకటించింది.. వాస్తవానికి ఈ మూడు సంస్థలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందు.. ఆ కంపెనీ ప్రతినిధులను ట్రంప్ కలిశాడు.. మనదేశంలో పెట్టుబడులు పెట్టకుండా నిలిపివేయడానికి ప్రయత్నించాడు. కానీ ఆ కంపెనీలు ఏమాత్రం అందుకు ఒప్పుకోలేదు.అమెరికన్ కంపెనీలు భారతదేశంలోకి విపరీతంగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ట్రంప్ ఏమాత్రం సహించలేకపోతున్నాడు. భారతదేశం మీద ఏదో ఒక రకంగా విమర్శలు చేస్తూనే ఉన్నాడు.. అమెరికన్ కంపెనీలను తీవ్రస్థాయిలో తప్పుపడుతున్న ట్రంప్.. తన రియల్ ఎస్టేట్ కంపెనీ ద్వారా ఇండియాలోనే పెట్టుబడులు పెడుతుండడం విశేషం. ఇప్పటికే హైదరాబాదులో ట్రంప్ టవర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మొదలుపెట్టాడు అమెరికా అధ్యక్షుడు.

భవిష్యత్ కాలంలో తన వ్యాపారాన్ని ఇంకా పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ అమెరికన్ కంపెనీలను మాత్రం నిలువరిస్తున్నాడు.ట్రంప్ కు షాక్ ఇస్తూ అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం వల్ల.. ఆర్థిక రంగం సమూల మార్పులకు గురవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచ ఆర్థిక శక్తులలో నాలుగో స్థానంలో ఉంది. ఇదే స్థాయిలో అమెరికన్ కంపెనీలు పెట్టుబడులు పెడితే నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి చేరుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు చైనా సహాయంతో రష్యా స్థానాన్ని అమెరికా లాగేసుకుందని.. అయితే ఇప్పుడు చైనా ను అమెరికా నమ్మదని.. అమెరికాను కూడా చైనా నమ్మదని ఆర్థిక విశ్లేషకులు అంటున్నారు.. పైగా చైనాలో తన పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి అమెరికా ఇష్టపడదని.. చైనాలో నియంతృత్వ ప్రభుత్వం ఉండడంతో అమెరికా కంపెనీలు ప్రత్యామ్నాయంగా భారత్ వైపు చూస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. పైగా భారత దేశంలో 145 కోట్ల జనాభా ఉన్న నేపథ్యంలో అమెరికన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. మరో వైపు మెరికా భారతదేశంపై వాణిజ్య ఒత్తిడి పెడుతున్నప్పటికీ, దాని సొంత ఆర్థిక?సాంకేతిక క్షేత్రాలు నష్టపోతున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానం విఫలమనే ఆరోపణలు ఎదుగుతున్నాయి. భారత్‌తో పోలిస్తే, ఇజ్రాయెల్, రష్యా, గూగుల్ వంటి శక్తులు భారత్‌తో భాగస్వామ్యాలు పెంచుతున్నాయి.భారత్‌పై అదనపు సుంకాలు విధించి, వ్యవసాయ ఎగుమతులను (ముఖ్యంగా బియ్యం) నిరోధించాలని అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ చర్యలు అక్కడి రైతులను కూడా ఆగ్రహపరుస్తున్నాయి. పాకిస్తాన్‌తో సన్నిహితత్వం కలిగి ఉండటం వల్ల ట్రంప్ విదేశ విధానం ప్రశ్నార్థకమవుతోంది, దీనికి నోబెల్ బహుమతి వ్యామోహం కూడా కారణంగా చెబుతున్నారు.గూగుల్ 2029 నాటికి భారత్‌లో 70 మిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ నిర్మిస్తానని ప్రకటించింది. భారత్ డేటా సెంటర్ల ర్యాంకింగ్‌లో 14వ స్థానంలో ఉంది, అమెరికా, రష్యా, చైనా ముందున్నాయి. ఆసియా నిపుణులపై అమెరికా పరిమితులు వల్ల భారతీయులు కెనడా, ఆస్ట్రేలియా, యూకే వైపు మళ్లుతున్నారు. మైక్రోసాఫ్ట్ కూడా ఇలాంటి ప్రణాళికలు ప్రకటించింది, దీనివల్ల భారత్‌లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.ఇజ్రాయెల్ భారత్‌తో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలోనే ఆయుధాల తయారీకి ముందుకు వచ్చింది. స్థానిక సంస్థలతో కలిసి ఈ ప్రాజెక్టులు అమలు చేస్తారు, దీనివల్ల పాకిస్తాన్, టర్కీలకు షాక్ ఇచ్చారు. అమెరికా ఈ అభివృద్ధిని ఎలా తీసుకుంటుందనే ఆందోళన పెరిగింది. రష్యా కూడా ఆయుధ తయారీలో భారత్‌తో సహకారం పెంచుతోంది.అమెరికా పాకిస్తాన్‌తో క్రిటికల్ మినరల్స్ ఒప్పందం చేసుకుంది, గనుల నుంచి వనరులు త్వరగా వెలికితీయాలని ప్రణాళికిస్తోంది. భారత్‌పై టారిఫ్‌లు వేస్తున్నప్పుడు, పాకిస్తాన్‌లో పెట్టుబడులు పెంచడం వివాదాస్పదంగా మారింది.

## రెండో బిడ్డ ఉంటే ప్రభుత్వ ప్రోత్సహకం

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ లో ఇకపై రెండో శిశువుకు జన్మనిస్తే ప్రోత్సాహకాలు ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం యోచిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో జనాభా తగ్గుతుండటంతో ఈ రకమైన నిర్ణయాన్ని త్వరలోనే చంద్రబాబు తీసుకుంటారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. దేశంలోనే కాదు.. ఏపీలోనూ అందులో దక్షిణాది రాష్ట్రాల్లో గత కొన్నిరోజులుగా జనాభా సంఖ్య తగ్గుతూ వస్తుంది. దీంతో ఏపీ ప్రభుత్వం రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు ఇచ్చే యోచనలో ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లో వృద్ధుల జనాభా పెరగడంతో పాటు సంతానోత్పత్తి రేటు తగ్గుదల ఆందోళన కలిగిస్తుంది.ఇదే విషయాన్ని చంద్రబాబు పదే పదే అనేక బహిరంగ సభల్లో ప్రస్తావిస్తున్నారు. ప్రతి వారు ఇద్దరు లేదా ముగ్గురు సంతానాన్ని కలిగి ఉండాలని చెబుతూ వస్తున్నారు. అయితే పెరుగుతున్న ఖర్చులు, ఆర్థిక భారం దృష్ట్యా చాలా మంది సింగిల్ శిశువుకే పరిమితమవుతున్నారు. దీంతో పాటు సంతాన సాఫల్యత పెంచేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫెర్టిలిటీ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంలో ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. జనాభా నియంత్రణ నుంచి జనాభా సుస్థిరత వైపు ప్రభుత్వ పాలసీని మార్చుకుని చంద్రబాబు ఆ దిశగా త్వరలోనే కీలక ప్రకటన చేయనున్నారని తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లో జనాభా సంక్షోభం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు ఆందోళనకరంగా పడిపోవడంతో, భవిష్యత్తులో తలెత్తే తీవ్ర పరిణామాలను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్, హంగేరీ వంటి దేశాల్లో అమలు చేస్తున్న తరహాలో 'రెండో బిడ్డను కనేవారికి' ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఇటీవల అమరావతిలో జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో ఈ ఆందోళనకరమైన గణాంకాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ బయటపెట్టారు. జాతీయ సగటు 28.4 ఏళ్లతో పోలిస్తే, ఏపీలో సగటు వయసు 32.5 ఏళ్లుగా ఉందని, ఇది రాష్ట్రం వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తోందనడానికి సంకేతమని ఆయన వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5కు పడిపోయిందని, ఇది సాధారణంగా ఉండాల్సిన 2.1 కంటే చాలా తక్కువని తెలిపారు.

# మాటల్లేవా..?



**గుంటూరు,తెలంగాణ దిశ :**తెలుగు సినిమా ఇండస్ట్రీలో పవన్ కళ్యాణ్ కి చాలా మంచి క్రేజ్ అయితే ఉంది. ఆయన నుంచి వచ్చిన ప్రతి సినిమాలో ఏదో ఒక వైవిధ్యమైతే ఉంటుంది. ప్రతి ప్రేక్షకుడిని థియేటర్ కి రప్పించడం ఆయన కీలకపాత్ర వహిస్తూ ఉంటాడు?అలాంటి పవన్ కళ్యాణ్ నుంచి వచ్చే ప్రతి సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుంది. తన అభిమానులు సైతం అతని సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. గత సంవత్సరం ఓజీ సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించిన ఆయన ఈ సంవత్సరం 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు? ఈ సినిమా ఎలా ఉండబోతుంది అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ అటు పాలిటిక్స్ లో బిజీగా ఉంటూనే సినిమాలను చేస్తూనే తన అభిమానులను అలరించే ప్రయత్నం చేస్తున్నాడు?ఇక ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది నటులతో మాట్లాడటం లేదనే వార్తలు వైరలవుతున్నాయి. బేసిగ్గా పవన్ కళ్యాణ్ ఎవరితో గొడవ పెట్టుకోడు. ప్రొఫెషన్ పరంగా మాత్రం ఆయన ఎవరి పని వాళ్ళు చేసుకుంటే బాగుంటుందనే ఆలోచనలో ఉంటాడు.ఇలాంటి నటుడు తన క్లోజ్ ఫ్రెండ్ అయిన అలీ వైసీపీ పార్టీలోకి వెళ్లి పవన్ కళ్యాణ్ దూషిస్తూ కొన్ని మాటలు మాట్లాడడంతో ప్రస్తుతం ఇప్పటికీ అతనితో పవన్ కళ్యాణ్ మాట్లాడడం లేదట. ఒకవేళ అలీ కనక పవన్ కళ్యాణ్ తోనే ఉండుంటే ఇప్పుడు అలీ చాలా మంచి పొజిషన్లో ఉండేవాడు. పాలిటిక్స్ లో కూడా తను రాణించే అవకాశమైతే ఉండేది.కానీ అలా కాకుండా వైసీపీ పార్టీ లోకి వెళ్లి తప్పు పని చేశారని చాలామంది అతన్ని విమర్శిస్తున్నారు. ఇక ఏది ఏమైనా కూడా పవన్ కళ్యాణ్ కి అత్యంత ఆత్మీయుడైన అలీ వేరే పార్టీలో చేరడాన్ని పవన్ కళ్యాణ్ జీర్ణించుకోలేకపోయాడు. అందుకే ప్రస్తుతం పవన్ కళ్యాణ్ అలీతో మాట్లాడడం లేదనే వార్తలు కూడా వస్తున్నాయి?

# 'ద గోల్ మిషన్' అనుష్క





**హైదరాబాద్,తెలంగాణ దిశ :**పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న కుటుంబంలో పుట్టింది చిన్నారి అనుష్కకుమారి. వైకల్యబాధితుడైన తండ్రి మంచానికే పరిమితమ య్యాడు. కూలి పని చేసుకుని ఇంటిని సాకుతున్న అమ్మకి చిన్న వయసు నుండే ఆసరాగా నిలబడింది. చదువుకుంటూనే చేతనైన పనులు చేస్తూ ఆర్థికంగా అమ్మకి సాయం చేసేది. ఇలాంటి పరి స్థితుల మధ్యే అనుష్క ఓ కల కన్నది. ఆ కల తనని అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా ప్రపంచం ముందు నిలబెట్టింది. ఈ ఏడాది ప్రధాన మంత్రి బాల పురస్కార్ అవార్డు తీసుకున్న బాలల్లో అనుష్క ఒకరు. ఫుట్‌బాల్ క్రీడలో దూసుకుపోతున్న తనని అభిమానులు 'ద గోల్ మిషన్' అని పిలుచుకుంటారు. ఆర్థికంగా కుటుంబం గడవడమే కష్టమైన వాతావరణంలో ఇంత స్థాయికి ఎగబాకిన అనుష్క ప్రయాణం ఎంతో స్ఫూర్తిమంతం. భారత ఎస్ఎఎఫ్ఎఫ్ యు -17 ఛాంపియన్‌షిప్ పోటీలో భూ టాన్‌తో భారత బృందం తలపడినప్పుడు టీమ్‌లో ఉన్న అనుష్క కొట్టిన ప్రతి బాల్ నెట్‌కి చేరింది. తన ఆట తీరు చూస్తున్న ప్రేక్షకులు, అభిమానులు తన చాకచక్యం చూసి ఔరా అన్నారు. 14ఏళ్ల చిన్నారి అంత తీక్షణమైన ఆటతీరు కనబరచడం వెనుక కఠోర సాధన ఒక్కటే కాదు, కన్నీళ్లు తెప్పించే కథ కూడా ఉంది. జార్ఖండ్ రుక్కా ఆదివాసీ గ్రామంలో అనుష్క పుట్టింది. ఫుట్‌బాల్ ఆటవైపు ఆడపిల్లలు కన్నెత్తి కూడా చూడని ఆ సమాజంలో తను మైదానంలోకి అడుగుపెట్టింది. మొదట్లో అనుష్క అబ్బాయిలతో కలసి ఆట నేర్చుకుంది. తన తొలి గురువు మేనత్త, జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి సోనీ కుమారి.

ఫుట్ బాల్ నేర్చుకోవడానికి అనుష్క సిద్ధంగా ఉంది. నేర్పించడానికి మేనత్త కూడా సిద్ధమైంది. అయితే ఇక్కడ తనకి ఎదురైన ఇబ్బందిని అనుష్క స్వయంగా ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పింది. 'నేను ఆట నేర్చుకోవడానికి సిద్ధమైనప్పుడు మా టీమ్‌లో అమ్మాయిలు ఎవరూ లేరు. దీంతో అబ్బాయిలతో ఆట నేర్చుకున్నాను. అయితే అబ్బాయిలకి అది ఇష్టం లేదు. చాలా ఇబ్బందిగా ఫీల్ అయ్యారు. కానీ ఆటలో నా ప్రతిభ చూసి వారు చాలా మారారు' అని చెప్పింది. 2021లో హజారీబాగ్ ఉచిత రెసిడెన్షియల్ ఫుట్‌బాల్ శిక్షణ కేంద్రంలో చోటు సంపాదించే వరకు అనుష్క ఎంతో శ్రమపడింది. కేంద్రానికి వచ్చాక సౌకర్యవంత భోజనం, వసతి, ప్రొఫెషనల్ కోచ్ ఆమె ఆటని మరింతగా మెరుగుపరిచాయి. అప్పటికి తన వయసు కేవలం 11 ఏళ్లు. ఇంత చిన్న వయసులో కుటుంబానికి దూరంగా ఉండడం, కఠిన వ్యాయామాలు చేయడం, అలసటని అధిగమించడం ఏవీ అంత సులభం కాదు. కానీ అనుష్క వాటిని అధిగమించింది. తన కలని నెరవేర్చుకోవడానికి ఇవేవీ పెద్ద అడ్డంకి కాదని భావించింది. 13 ఏళ్లకే జాతీయస్థాయిలో ఫుట్‌బాల్ బృందంలో స్థానం దక్కించుకున్న అనుష్క, తొలి టోర్నమెంట్ 2023లో నేపాల్‌లో జరిగింది. ఎస్ఎఎఫ్ఎఫ్ యు -16 ఎంపికై, తనకంటే పెద్దవారితో పోటీపడి ఐదు గోల్స్ చేసింది. టాప్ స్కోరర్‌గా నిలిచింది. మొదటిసారి భారత జెర్సీని ధరించి ఆట ఆడిన అనుష్క ఆ ఆట ముగిసినప్పుడు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎంతో భావోద్వేగంగా మాట్లాడింది. 'నేను నా కోసం ఆడడం లేదు.

నాలా కలలు కనే ప్రతి అమ్మాయి కోసం ఆడుతున్నాను' అని చెప్పింది. మైదానంలో 'ఇంతలా ఎలా పోరాడుతుందో' అనేదానిపై కూడా అనుష్క మాట్లాడింది. 'భవన నిర్మాణరంగ కార్మికుడిగా పనిచేసే నాన్నకి ఓ ప్రమాదం కారణంగా వైకల్యం వచ్చింది. అప్పుడు అమ్మ కుటుంబ భారాన్ని తన మీద వేసుకుంది. కష్టపడి పనిచేసేది. ఎంతో ఓర్పుగా ఉండేది. నాన్నపై ఎప్పుడూ ఫిర్యాదు చేసేది కాదు. ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా నిలబడి పోరాడడం అమ్మ నుండి నేర్చుకున్నాను. నేను చేసే ప్రతి గోల్ అమ్మ కోసం. నాన్న కోసం. నాపరిస్థితులు ఎంత అధ్వాన్నంగా ఉన్న నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికోసం' అంది. ఫుట్‌బాల్‌లో ఆమె సాధించిన విజయాలు చూసి ఆశ్చర్యపోయేవాళ్లంతా ఇప్పుడు తన క్రీడాస్ఫూర్తికి మాత్రమే కాదు, ఇంత చిన్న వయసులోనే కుటుంబాన్ని, అమ్మని, నాన్నని అర్థం చేసుకున్న తీరుని చూసి కూడా మెచ్చుకోవాలి.

# నీలి విప్లవాన్ని నీరుగారుస్తున్న సర్కార్



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు అరవై ఏండ్లపాటు తెలంగాణ మత్స్యరంగం పూర్తిగా నిర్లక్ష్యానికి, అణచివేతకు, విస్మరణకు గురైంది. ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో దాదాపు పదేండ్లలో గుణాత్మక అభివృద్ధి నమూనాగా రూపొందింది. ఇప్పుడు ఆ నమూనాలను సమూలంగా ధ్వంసం చేసేందుకు కాంగ్రెస్ పాలకులు పూనుకున్నట్టు కనిపిస్తున్నది. ఇందుకుపలు నిదర్శనాలు ఉన్నాయి. రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం, స్వావలంబ న కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన చేపపిల్లల ఉచిత పంపిణీ పథకాన్ని నీరుగార్చడం, మత్స్యసహకార సంఘాలను నిర్వీర్యం చేయడం, మత్స్యకారుల ఉపాధి కల్పనలో జీవనాడిగా నిలిచిన నీటివనరులను విధ్వంసం చేయడం లాంటి మూడు పద్ధతులను ఈ ప్రభుత్వం అమలు పరుస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రప్రభుత్వమే సహకార వ్యవస్థను అడ్డుపెట్టుకుని, మత్స్యశాఖను వాడుకుంటూ ముప్పేట దాడికి పాల్పడుతున్నది. ఫలితంగా రాష్ట్రంలోని 50 లక్షలకుపైగా మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలోనే వినూత్నమైన పద్ధతిలో మత్స్యకారులకు చేపపిల్లల ఉచిత పంపిణీ పథకాన్ని అమలు చేసింది. 2016లో ప్రారంభిం చిన ఈ పథకంతో ఎనిమిది పర్యాయాలు లబ్ధి చేకూర్చింది. ఇందుకు రూ.560 కోట్లు ఖర్చుచేసింది. మత్స్య సహకార సంఘాల బలోపేతం కోసం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా సుమారు రూ.1000 కోట్ల భారీ రుణసదుపాయంతో సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని అమలు పరిచింది. ఈ రెండు కార్యక్రమాల ఫలితంగా మత్స్యకారుల జీవితాల్లో నూతనోత్సాహం కనిపించింది. మత్స్యసహకార సంఘాల్లో సభ్యత్వానికి ఆసక్తి, పోటీ పెరిగాయి. సంఘాల్లో సభ్యులుగా చేరడాన్ని గుర్తింపు, గౌరవంగా భావించే పరిస్థితులు నెలకొన్నాయి. సమగ్ర విధానాలతో చేపల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల నమోదయ్యింది. మత్స్యకారుల తలసరి ఆదాయం పెరిగింది. తెలంగాణలో నీలివిప్ల వం కనిపించింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేండ్లుగా మత్స్యరంగంలో, మత్స్యకారుల జీవన స్థితిగతుల్లో తిరోగమన పరిస్థితులు ఎదురవుతున్నాయి. నీలి విప్లవం నీరుగారిపో తున్నది. చేపపిల్లల పంపిణీ పథకం అమల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. రెండేండ్లలో పథకం కనీసం 50శాతం కూడా అమలు జరగలేదు. చేపపిల్లలు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలోనూ ప్రభుత్వం మొండివైఖరిని అవలంబిస్తున్నది. కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించగా, బిల్లుల చెల్లింపు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది.

అయినప్పటికీ ప్రభుత్వం కాంట్రాక్టర్లను సతాయిస్తూనే ఉన్నది. బిల్లులను పూర్తిగా చెల్లించలేదు. ఈ తాత్సారంపై కూడా కాంట్రాక్టర్లు మరోసారి హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. బిల్లుల చెల్లింపు వ్యవహారాలు కోర్టుధిక్కరణ కేసులను నమోదుచేసే స్థాయికి వెళ్లాయి. అయినా ఈ ప్రభుత్వంలో, మత్స్యశాఖలో చలనం లేదు. కొత్తగా మత్స్యశాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ పథకాన్ని పకడ్బం దీగా, పారదర్శకంగా అమలు చేస్తున్నదని, రూ.122 కోట్లు కేటాయిం చినట్టు గొప్పలు చెప్పారు. కానీ మంత్రి ప్రకటించిన లెక్కల్లో సగం కూడా వాస్తవంలో పంపిణీ జరగకపోవడం, నిధులు ఖర్చు పెట్టకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి, మత్స్యశాఖమంత్రి పనితీరుకు అద్దం పడుతున్నది. ఇక ప్రత్యేక పథకం అమలు పరచాలనే ఆలోచన, ప్రయత్నం ప్రభుత్వం వద్ద లేవు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఫిషరీస్ కార్పొరేషన్ అంశం ఉద్దేశపూర్వకంగానే అటకెక్కించారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి మత్స్యశాఖమంత్రిగా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించడంలేదు. మొత్తంగా గడిచిన రెండేండ్ల కాంగ్రెస్ పాలనాకాలంలో మత్స్యకారుల్లో తీవ్రమైన నిరాశ, నిస్పృహ నెలకొన్నాయి. కానీ మత్స్యశాఖ అధికారులు మాత్రం తెలంగాణలో చేపల ఉత్పత్తి ఏటా పెరుగుతున్నదని, చేపల ఆహార వినియోగంలో గణనీయమైన అభివృద్ధి జరుగుతున్నదని, రాష్ట్రంలోని ప్రజలకు చేపలు విస్తారంగా అందుబాటులో ఉంటున్నాయని 'స్టీరియోఫోనిక్' నివేదికలు తయారుచేసి, స్వీయ కితాబులు ఇచ్చుకుంటున్నారు. సహకార వ్యవస్థకు సంబంధించిన స్ఫూర్తిని సమూలంగా సంహరించడ మే తెలంగాణలో నేటి పాలకులు తమ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మత్స్య సహకార సంఘాల ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. పేద మత్స్యకారుల సాధికారత కోసం ఏర్పడిన ఈ వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నది. ముఖ్యంగా తెలంగాణ సహకార సంఘాల చట్టం-1964లోని సెక్షన్ 32 (7)(ఏ) (1)ను అడ్డం పెట్టుకొని, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను అడ్డుకుంటూ, పాలకపెద్దలు తన సొంత పార్టీ క్యాడర్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌ల రూపంలో సంఘాలపై రుద్దుతున్నది. సాధారణంగా ఏదైనా సహకార సంఘం పదవీ కాలం ముగిసినప్పుడు, అనివార్య కారణాల వల్ల ఎన్నికలు జరగకపోతే, తాత్కాలికంగా ఆ సంఘం కార్యకలాపాల ను పర్యవేక్షించడా నికి అధికారులను లేదా ఒక కమిటీని నియమిం చేందుకు ఈ సెక్షన్ అవకాశం కల్పిస్తుంది. అయితే, ఇది కేవలం తాత్కాలిక ఏర్పాటు మాత్రమే.

# ఎమ్మెల్యే ముద్దు... ఎంపీ వద్దు..!

**విజయవాడ,తెలంగాణ దిశ :**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర పై చాలా ఆశలు పెట్టుకుంది. అందుకే ఆ పార్టీ సీనియర్లకు ఇప్పుడు పెద్దపీట వేస్తోంది. శాసనమండలిలో వైసీపీ పక్ష నేతగా బొత్స సత్యనారాయ ణకు అవకాశం ఇచ్చింది. ఇక ధర్మాన ప్రసాదరావుకు తాడేపల్లి కార్యాలయ బాధ్యతలతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే ఇదంతా ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాల్లో బలం పెంచుకోవడానికి స్పష్టమవుతోంది. ఉత్తరాంధ్రలో మొత్తం 34 అసెం బ్లీస్థానాలు ఉన్నాయి. ఐదు పార్లమెంటు స్థానాలు కొనసాగుతున్నాయి. మొన్నటి ఎన్నికల్లో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చింది. అయితే 2029 ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని భావిస్తోంది ఆ పార్టీ. అయితే అసెంబ్లీ స్థానాలకు పర్వాలేదు కానీ.. పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసేందుకు ఆ పార్టీకిఅభ్యర్థులు దొరకడం లేదు.ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయ నగరం,అరకు, అనకాపల్లి, విశాఖపట్నం పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. అందులో ఒక్క అరకులోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ తనుజారాణి ఉన్నారు. మిగతా చోట్ల కూటమి ఎంపీలే కొనసాగుతున్నారు. శ్రీకాకుళం నుంచి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం నుంచి కలి శెట్టి అప్పలనా యుడు, విశాఖ నుంచి శ్రీ భరత్,అనకాపల్లి నుంచి సీఎం రమేష్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో సీఎం రమేష్ ఒక్కరే బిజెపి నుంచి ఎంపీగా ఉన్నారు. అయితే టిడిపి కూటమి నుంచి సిట్టింగ్ ఎంపీలు మరోసారి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం పోటీ చేసేందుకు నేతలు ముందుకు రావడం లేదు. దీంతో జగన్మోహన్ రెడ్డి ఆ బాధ్యతను బొత్స సత్యనారాయణకు అప్పగించినట్లు ప్రచారం నడుస్తోంది.శ్రీకాకుళం జిల్లాలో కింజరాపు రామ్మోహన్ నాయుడు వరుసగా మూడుసార్లు ఎంపీ అయ్యారు. బలమైన అభ్యర్థిగా మారారు. ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయనను ఢీకొట్టడం అంటే చాలా కష్టం. 2019 ఎన్నికల్లో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానంలో మాత్రం రామ్మోహన్ నాయుడు గెలిచారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఐదు చోట్ల వైసిపి గెలిచింది. కానీ రామ్మోహన్ నాయుడు మాత్రం గెలిచారు ఎంపీగా. గడిచిన ఎన్నికల్లో ఆయనపై పోటీ చేసి ఓడిపోయారు పేరాడ తిలక్. 2019లో దువ్వాడ శ్రీనివాస్ పోటీ చేసి ఓడిపోయారు. 2014లో రెడ్డి శాంతి పోటీ చేసి అలానే ఓడిపోయారు.

అయితే ఈసారి తమ్మినేని సీతారాం పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. అయితే రామ్మోహన్ నాయుడు కు ధీటైన అభ్యర్థిని రంగంలోకి దించాలని జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేస్తున్నారు. కానీ ఎవరు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అయితే ధర్మాన ఫ్యామిలీ నుంచి ఒకరిని బరిలో దించితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.విజయనగరం ఎంపీగా ప్రస్తుతం కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ పై గెలిచారు. 2029 ఎన్నికల్లో మరోసారి బెల్లాన చంద్రశేఖర్ పోటీ చేస్తానని చెబుతున్నారు. కానీ ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు బొత్స ఝాన్సీ లక్ష్మి ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో ఆమె ఇదే స్థానం నుంచి ఎంపీగా ఉండేవారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖ నుంచి ఆమె పోటీ చేశారు. మరోవైపు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేరు కూడా వినిపిస్తోంది. అయితే ఇక్కడ బొత్స సత్యనారాయణ నిర్ణయం పనిచేయనుంది.విశాఖపట్నం నుంచి మరోసారి పోటీ చేసేందుకు మాజీ ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఆసక్తి చూపిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆయన అసెంబ్లీకి పోటీ చేశారు. అయితే విశాఖ నుంచి మరోసారి బొత్స ఝాన్సీలక్ష్మి అయితే బాగుంటుందని జగన్ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. మరోవైపు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పోటీ చేస్తే బాగుంటుందని వైసీపీ క్యాడర్ అంటుంది. కానీ అమర్నాథ్ మాత్రం తాను పోటీ చేయనని తేల్చి చెబుతున్నారు. తనకు విశాఖ నగరం పరిధిలో ఏదో ఒక అసెంబ్లీ స్థానం టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు.అనకాపల్లి నుంచి గత ఎన్నికల్లో పోటీ చేశారు బూడి ముత్యాల నాయుడు. మాడుగుల నియోజకవర్గం నుంచి గెలిచిన ఆయనను జగన్మోహన్ రెడ్డి క్యాబినెట్ లోకి తీసుకున్నారు. డిప్యూటీ సీఎం పదవి కూడా ఇచ్చారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా సీఎం రమేష్ రంగంలోకి దిగారు. దీంతో జగన్మోహన్ రెడ్డి బూడి ముత్యాల నాయుడు తో పోటీ చేయించారు. కానీ ఆయనకు ఓటమి తప్పలేదు. మరోసారి ఎంపీగా పోటీ చేయాలని జగన్మోహన్ రెడ్డి సూచిస్తున్నారు. కానీ అందుకు ముత్యాల నాయుడు సుముఖంగా లేరు

## మదురో కిడ్నాప్ తర్వాత!

ఒక సర్వ సత్తాక దేశం మీద దాడి చేసి ఆ దేశపు అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి అన్ని అంతర్జాతీయ న్యాయ సూత్రాలనూ కాలరాసిన ట్రంప్ తాను వెనిజులాలో ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడానని చెప్పుకుం టున్నాడు ! మదురో ఒక మాదకద్రవ్య ముఠాకు నాయకుడిగా ఉన్నట్టు, ఆ ముఠాను అరికట్టకపోతే అమెరికా భద్రతకే ముప్పు వాటిల్ల నున్నట్టు ప్రచారం చేస్తున్నాడు. కానీ వాస్తవానికి ప్రపంచంలో జరుగుతు న్న కొకైన్ వ్యాపారంలో ఉన్న అంతర్జాతీయ ముఠా నెట్‌వర్క్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నది మెక్సికో, కొలంబియా, హొండురాస్, అర్జెంటినా, ఈక్వెడార్ వంటి దేశాల్లోనుండి పని చేస్తున్న మితవాద శక్తులు. ఈ శక్తులకు అమెరికా అండదండలు పుష్కలంగా లభిస్తున్నాయి. అందులో వెనిజులా దేశంలోని డ్రగ్ మాఫియా వాటా నామమాత్రమే. ఐనా, తక్కిన దేశాలను వదిలిపెట్టి వెనిజులా మీదనే పడ్డాడు ట్రంప్. ఈ దాడికి ప్రధాన కారణం వెనిజులాలో ఉన్న చమురు నిల్వల మీద పెత్తనాన్ని పొందాలని అమెరికా భావించడమే. వెనిజులాతో ప్రారంభించి మొత్తం లాటిన్ అమెరికా దేశాలన్నింటిపైనా తన పెత్తనాన్ని చెలాయించాలని అమెరికా భావిస్తోంది. 1817-1825 మధ్య అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరించిన జేమ్స్ మన్రో ఆ కాలంలో ఒక సిద్ధాంతాన్ని ప్రకటించాడు. దానినే మన్రో సిద్ధాంతం అని పిలుస్తారు. దాని ప్రకారం తన దేశ భద్రత, రక్షణ అవసరాల కోసం ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా సైనిక చర్యలతో సహా ఎటువంటి చర్యలకైనా పూనుకునే హక్కు అమెరికాకు ఉంది. చాలా దుర్మార్గమైన ఈ సిద్ధాంతానికి తర్వాత కాలం చెల్లింది. కాని ట్రంప్ శతాబ్దాలక్రితమే తిరస్కరించబడిన ఆ సిద్ధాంతాన్ని మళ్లీ ముందుకు తెచ్చాడు. ఇప్పుడు మన్రో సిద్ధాంతం కాస్తా 'డాన్రో' సిద్ధాంతంగా పేరు మార్చుకుంది. (ట్రంప్ పేరులోని మొదటి భాగం డొనాల్డ్‌లోని డాన్ ను, మన్రో పేరులోని ఒక భాగాన్ని కలిపి డాన్రో చేశారు)

అమెరికాకనుకూలంగా తొత్తు మాదిరిగా వ్యవహరించే ప్రభుత్వాన్ని తొలగించి ఆ స్థానంలో చావెజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక వెనిజులాలోని చమురు కంపెనీలను జాతీయం చేశాడు. వాటి ద్వారా లభించే ఆదాయాన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేయసాగాడు. దానికి ప్రతీకారంగా అమెరికా వెనిజులా మీద ఆంక్షలు ప్రకటించింది. విదేశాల్లో ఉన్న వెనిజులా పెట్టుబడులను స్తంభింపజేసింది. దాంతో వెనిజులా తీవ్ర ఆర్థిక వత్తిడికి లోనైంది. ఆ పరిస్థితుల్లో వెనిజులా చైనా, రష్యా, ఇరాన్ దేశాలతో ఆర్థిక, సైనిక సంబంధాలను బలపరుచుకుంది. తక్కిన లాటిన్ అమెరికా దేశాలకు దగ్గరైంది. ఐనప్పటికీ అమెరికా ఆంక్షలు వెనిజులాను కుంగదీశాయి. గతంలో రోజుకు 3.5 లక్షల బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేసిన పరిస్థితి నుండి ఆంక్షల తర్వాత అందులో మూడో వంతు కూడా ఉత్పత్తి చేయలేని స్థితి వచ్చింది. ఇదే అదనుగా భావించిన ట్రంప్ మదురో దంపతుల కిడ్నాప్‌కూ పూనుకున్నాడు. వారిని అడ్డం పెట్టుకుని వెనిజులాలోని చమురు కంపెనీల మీద మళ్లీ పెత్తనాన్ని పొందాలని భావిస్తున్నాడు. అందుకు వీలుగా వెనిజులాలో తన తొత్తుగా వ్యవహరించే మారియా కొరినా మచాడోను గద్దె మీద కూర్చోబెట్టదలిచాడు. కానీ వెనిజులాలోని ప్రజాభిప్రాయం అందుకు బాగా వ్యతిరేకంగా ఉంది. మదురోతోబాటు ఉపాధ్యక్షురాలిగా పని చేసిన డెల్సీ రోడ్రిగజ్ తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు ఇప్పుడు నిర్వహిస్తున్నారు, తామంతా మదురోతోనే ఉన్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు అమెరికా ఎలా వ్యవహరించబోతోంది అన్నది చూడాలి.

వెనిజులాలో చమురు నిల్వల మీద పట్టు ఒకవేళ అమెరికా సంపాదిం చినా, మళ్లీ అక్కడ చమురు ఉత్పత్తిని పాత స్థాయికి తీసుకురావాలంటే 18000 నుండి20000 కోట్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడులు వెంటనే అవసరం. కాని అమెరికన్ చమురు కంపెనీల మొత్తం పెట్టుబడులే 41,300 కోట్ల డాలర్లు. అదీ గాక, ఒకసారి జాతీయం అయిన చమురు కంపెనీల నుండి తాము పొందుతున్న ప్రయోజనాలను చవి చూసిన వెనిజులా ప్రజలు తమ చమురు కంపెనీలను అమెరికాకు కట్టబెట్టడానికి అంగీకరించే పరిస్థితిలో లేరు. ఇంకో పక్క చైనా కూడా వెనిజులాలో భారీగానే పెట్టుబడులు పెట్టింది. మదురోను కిడ్నాప్ చేసిన వెంటనే చైనా, రష్యా వెనిజులాకు, మదురోకు తమ మద్దత్తు ప్రకటించాయి. అందుచేత వెనిజులా విషయంలో అమెరికాదే ఇష్టారాజ్యంగా చెలామణీ అవుతుందని భావించలేం.

## పార్టీ నిర్మాణంపై ఫోకస్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత పాలనలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నంలో పడ్డారు. పార్టీ నిర్మాణం పై ఆయన ఫోకస్ పెట్టినట్లు పార్టీలో ప్రచారం జరుగుతుంది. గత ఎన్నికలలో ఓటమి పాలయి పదకొండు సీట్లకు పరిమితమయిన నాటి నుంచి జగన్ నోట కార్యకర్తల మాట పదే పదే వినిపిస్తుంది. ఒకరకంగా జగన్‌కు జ్ఞానోదయం అయింది. నియోజకవర్గాల వారీగా నేతలు అనుసరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్న జగన్ త్వరలోనే నియోజకవర్గానికి కార్యకర్తలతో కమిటీలు వేయాలని నిర్ణయించారని తెలిసింది. కార్యకర్తలకు ఇక ఐడి కార్డు, ఇన్స్యూరెన్స్ కల్పించనున్నారు. కార్యకర్తల్లో ఉన్న నిరాశను పారదోలాలంటే కార్యకర్తలను దగ్గరకు తీసుకునే ప్రయత్నాన్ని మొదలు పెట్టారన్నారు.వైఎస్ జగన్ ఎప్పుడూ తన బొమ్మతోనే గెలవాలని భావిస్తుంటారు. తన వల్లనే అధికారంలోకి రావాలని కోరుకుంటారు. 2019 ఎన్నికలలో పాదయాత్రతో అది జరిగినా, 2024 ఎన్నికల్లోనూ అదే మైండ్ సెట్ తో వెళ్లడంతో దారుణ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు ఏ రోజు కూడా కార్యకర్తల సమాశాలను జరిపింది లేదు. ప్లీనరీ ఏదో ఒకసారి తప్పించి అసలు నిర్వహించలేదు. క్యాడర్ తో కలవడం, వారితో కలసి భోం చేయడం వంటి పనులకు దూరంగా ఉన్నారు. టీడీపీ మహానాడు నిర్వహించేది కార్మకర్తల్లో ఉత్సాహం నింపడానికే. జెండా పట్టుకునే వారికి కనీసం ఏడాదికి ఒకసారి అయినా పలకరించాలన్న ధ్యాసను జగన్ మర్చిపోవడం వల్లనే మొన్నటి ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడే వారు లేకపోయారుఇక అధికారంలో ఉన్న ఐదేళ్లు పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఓటమి తర్వాత గ్రౌండ్ లెవెల్ లో పరిస్థితి అర్ధమయింది. నేతలు బయటకు రావడం లేదు. ధైర్యంగా వచ్చే కార్యకర్తలు సయితం నిర్లక్ష్యానికి గురి కావడంతో దూరంగా ఉన్నారు. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకున్న జగన్ ఇక కార్యకర్తలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. పోలింగ్ బూత్ లను కార్యకర్తలతోనే నియమించాలని నిర్ణయించారు. వారికి అన్ని రకాల సదుపాయాలను పార్టీ పరంగా కల్పించాలని డిసైడ్ చేసినట్లు తెలిసింది. ఇక మరొకవైపు అభ్యర్థుల ఎంపికపై కూడా టీడీపీ తరహాలోనే తన నిర్ణయం కాకుండా కార్యకర్తలు, ఐవీఆర్ఎస్ ద్వారా జనాభిప్రాయాన్ని తీసుకోవాలని జగన్ నిర్ణయించినట్లు సమాచారం. మొత్తం మీద జగన్ కార్యకర్తలకు చేరువయ్యే ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయన్నది మాత్రం కాలమే సమాధానం చెబుతుంది.

# ఇరకాటంలో ఐరోపా..!



ప్రపంచ పరిణామాలు సామాన్యుల ఊహకు అందకుండా మారుతున్నాయి. అనేక దేశాలు, దేశాధినేతల బండారాలు బయటపెడు తున్నాయి. ఏ రెండు పలనూ సంతుష్టీకరించాలంటే జరిగేది కాదు. వెనెజులామన మిత్రదేశమే, చౌకగా చమురు తెచ్చుకున్నాం, డోనాల్డ్ ట్రంప్ బెదిరించగానే మానేశాం, ఆ దేశాధ్యక్షుడు మదురో, సతీమ ణి కిడ్నాప్ తప్పని చెప్పలేకపోయాం. ఇరాన్ కూడా మనకు మిత్రదేశ మే. అమెరికా బెదిరించగానే అక్కడి నుంచీ కొనుగోలు నిలిపివేశాం. ఆదేశం మీద దాడులు చేస్తాం, పాలకులను మా ర్చివేస్తామని అమెరికా బెదిరిస్తుంటే తగదని అనలేకపోయాం. ఇరాన్‌లో చిక్కుకు న్నవారిని సురక్షితంగా రమ్మని సుభాషితం మాత్రమే చెప్పాం తప్ప రష్యాఉక్రెయిన్ యుద్ధ సమయంలో మా దిరిగా విమానాలు పంపి మన దేశీయులను వెనక్కి తీసుకురాలేదు.కొన్ని సమయాల్లో కొంద రు ఎలా ప్రవర్తిస్తారో గుర్తు చేసేందుకే ఇవి. ఈ సందర్భంగా అ మెరికా బెదిరింపులపై ఐరోపా స్పందన గురించి విశ్లేషించుకుం దాం. ప్రస్తుతం ఐరోపా ఇరకాటంలో పడింది. మదురో కిడ్నాప్, వెనెజులా చమురు సంపదలన్నింటినీ స్వంతం చేసుకుంటామన్నపు డు దానికి పట్టలేదు. ఇప్పుడు డెన్మార్క్‌లోని గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామనగానే ఐరోపా సమాఖ్యకు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. 'ఆర్కిటిక్ ప్రాంతానికి బాసట' పేరుతో పరిమిత విన్యాసాలు జరిపేందుకు గ్రీన్‌లాండ్‌కు మద్దతుగా పన్నెండు దేశాలు మిలిటరీని పంపేందుకు నిర్ణయించాయి. కొన్ని దేశాల నుంచి చేరుకున్నారు కూడా. దీంతో ఆగ్రహించిన ట్రంప్ ధిక్కారమును సైతునా అంటూ ఐరోపా దేశాల వస్తువుల మీద ఫిబ్రవరి ఒకటి నుంచి అదనపు సుంకాలు విధిస్తానని ప్రకటించాడు. అయితే దీనికి ప్రతిగా తాము కూడా అమెరికా వస్తువులపై 108 బిలియన్ డాలర్ల మేర ప్రతి సుంకాలు విధించేందుకు ఆలోచిస్తున్నట్లు ఐరోపా సమా ఖ్య ప్రకటించింది. గ్రీన్‌లాండ్ మా ఒక్కరి భద్రత కోసమే కాదు, ఐరోపా రక్షణకూ అవసరమే అని, తాము స్వాధీనం చేసుకోకపోతే రష్యా,చైనా ఆక్రమిస్తే మీకు అంగీకారమేనా అంటూ ట్రంప్ యం త్రాంగం ఎదురుదాడికి దిగింది. గత ఎనిమిది దశాబ్దాలుగా ఐరోపా రక్షణ బాధ్యత పేరుతో నాటో ఖర్చులో అధిక భాగం అమెరికా భరించింది. ఆ మేరకు పొదుపు మొత్తాలను పారిశ్రామిక, వాణిజ్య, సేవారంగాలకు మళ్లించిన ఐరోపా అనేక విధాలుగా రెండు ప్రప ంచ యుద్ధ నష్టాల నుంచి కోలుకున్నది. ఐరోపా నుంచి అమెరికా దిగుమతులు ఎక్కువగా చేసుకుంటున్నది. 2015 19తో పోలిస్తే 2020 24 నాటికి అమెరికా నుంచి ఐరోపా దేశాలు దిగుమతి చేసుకున్న ఆయుధాలు 28 నుంచి 52శాతానికి పెరిగాయి. అందు వలన మాతో తెగేదాకా లాగితే ఆయుధ దిగుమతులు తగ్గిస్తామని ఐరోపా సంకేతాలు పంపుతున్నది. అంతే కాదు చైనాతో లావాదే వీలు పెంచుకోవాల్సి వస్తుందని కూడా చెబుతున్నది. అందుకే దాగుడుమూతలా డుతున్నాయి. చైనా ప్రమాదాన్ని చూపి భారత్‌ను తన బుట్టలో వేసుకొనేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా, అదే ఎత్తుగడతో రష్యాను చూపి ఐరోపాను తన అదుపులో ఉంచుకోవా లని చూస్తున్నది. అందుకే అప్పుడప్పుడు మిత్రవైరుధ్యాలు తలెత్తి నప్పటికీ వాటిని శత్రువుల స్థాయికి తీసుకువెళ్లకుండా రాజీపడు తున్నాయి. ఇది ఎల్లకాలమూ సాధ్యమోతుందా?

బలహీనమైన అంశాల పట్ల కఠినంగా, బలమైన వాటి పట్ల జా గ్రత్తగా వ్యవహరిస్తున్నది ఐరోపా. దాన్లో భాగమే అమెరికా వస్తు వులపై పన్ను వేస్తామని హెచ్చరించటంగా చెప్పవచ్చు. అట్లాంటిక్ దేశాల మధ్య ఇదొక తీవ్రమైన సంక్షోభానికి గుర్తు అని తాజా పరిణామాల గురించి ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక వ్యాఖ్యానించింది. అంత తేలికగా అమెరికా వత్తిడికి ఐరోపా లొంగే అవకాశాలు లేవనికొందరు చెబుతున్నారు. ట్రంప్‌ను సంతుష్టీకరించేందుకు ఇప్పటి వరకు ఐరోపా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనట్లుగా చెబు తున్నారు. గ్రీన్‌లాండ్ కావాల్సిందేనని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ మరోసారి చెప్పాడు. ఆ ప్రాంతం అమెరి కాలో అంతర్భాగం గాకపోతే రక్షణ అసాధ్యమన్నాడు. తమ చర్య అందరికీ మంచిదని, యూరోపియన్స్ దీన్ని అర్థం చేసుకుంటారని భావిస్తున్నా అని మాత్రమే బెసెంట్ చెప్పాడు. ట్రంప్ ఈ విషయంలో వెనక్కు తగ్గకపోతే అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందానికి ఐరోపా పార్లమెంటు ఆమోద ముద్రవేసే అవకాశం లేదని వార్తలు వచ్చాయి. ఒకవైపు అమెరికాను అడ్డుకోవాలంటున్న ఐరోపా దేశాల మధ్య పూర్తి ఏకాభిప్రాయం లేదు. గ్రీన్‌లాండ్ ప్రాంతంలో మిలిటరీ విన్యాసాలకు దూరంగా ఉండాలని జర్మనీ నిర్ణయించింది. జర్మనీ మిలిటరీ బృందం రెండోరోజే వెనక్కి వెళ్లింది. ఈ విన్యాసంలో పాల్గొన్న దేశాల మీద ప్రత్యేకించి పన్నులు విధించాలని ట్రంప్ నిర్ణయించినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి అన్నమాట ప్రకారం పన్నులు వేస్తారా లేక బేరసారాల కోసం వాయిదా వేస్తారా అన్నది చూడాల్సి ఉంది. ఐరోపా ప్రతిపన్ను హెచ్చరిక కూడా ఎత్తుగడలో భాగమే అంటున్నారు. అమెరికాతో తెగతెంపులు చేసుకుంటే ఎనిమిది దశాబ్దాలుగా అనుసరించిన విధానాలన్నింటినీ మార్చుకోవాల్సి ఉంటుంది. అది ఒక్క గ్రీన్‌లాండ్‌తోనే సమసిపోదు. మొత్తం నాటో కూటమి ఉనికి ప్రశ్నార్ధకం అవుతుంది. ప్రపంచ బలాబలాల్లో వచ్చే మార్పులు తమకు లాభదాయకమా లేక అమెరికాతో ఉంటేనే మంచిదా అన్న మథింపు జరిగిన తరువాత నిర్ణయాత్మక పరిణామాలు జరుగుతాయి తప్ప ఇప్పటికిప్పుడు జరిగే అవకాశాలు పరిమితం. అసలు గ్రీన్‌లాండ్‌తో నిమిత్తం లేకుండానే ఎప్పటి నుంచో ఐరోపా మీద వత్తిడి తెచ్చేందుకు అమెరికా ఒక వ్యూహం అనుసరిస్తున్నదని చెబుతున్నారు. ఐరోపాను ఒక వలస ప్రాంతంగా చూస్తూ తన నిబంధనలను అక్కడ రుద్దాలని చూస్తోందని, అందుకుగాను ఎంతకైనా తెగిస్తోందని ఐరోపా వర్గాలు భావిస్తున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇంతగా గతంలో ఎన్నడూ ఐరోపా పట్ల అమెరికా వ్యతిరేకత వెల్లడి కాలేదేని ఐరోపా విశ్లేషకు లు చెబు తున్నారు. నాటో అనుకూల ఐరోపా దేశాల్లో అమెరికా పట్ల పునరాలో చనకు నాంది పడింది.

# ధరణి.. కథ ఇంతింత కాదయా?




**హైదరాబాద్,తెలంగాణ దిశ :**బీఆర్ఎస్ హయాంలో తీసుకు వచ్చిన ధరణి పోర్టల్ భూకబ్జాలకు కేంద్రంగా మారిందని తెలంగాణ ప్రభుత్వం నియమి ంచిన ఉన్నతస్థాయి కమిటీ నివేదిక సమర్పించినట్లుగా తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు తాజాగా ప్రభుత్వం నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలినట్లుగా తెలుస్తోంది. సిద్దిపేట, సిరిసిల్ల వంటి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ విచారణలోగ్ర్భ్భాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని చెబుతున్నారు.రికార్డులు సరిగ్గా లేని భూ ములు,వివాదాస్పదమైన ఖరీదైన ఆస్తులను ఒక మాఫియాగా ఏర్ప డినిబంధనలకు విరుద్ధంగా తమ పేర్ల మీదకు మార్చుకున్నట్లు ప్రాథమికనివేదిక స్పష్టం చేస్తోంది. అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు మరియు నిషిద్ధ జాబితా లో ఉన్న భూములను అత్యంత రహస్యంగా ధరణి రికార్డుల నుంచి తొలగించి, ప్రైవేటు వ్యక్తుల పేర్లపైకి మార్చినట్లుగా బయటపడిందని చెబుతు న్నారు. ముఖ్యంగా హైదరాబాద్ శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి పరిధిలో సుమారు 15,000 ఎకరాల పైచిలుకు ప్రీమియం భూములు అక్రమాలకు గురైనట్లు లెక్కలు తేలాయని నివేదికలో ఉన్నట్లుగా తెలుస్తోంది.వీటి విలువ అక్షరాలా లక్ష కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. అర్ధరాత్రి వేళల్లో పోర్టల్ ఓపెన్ చేసి డేటాను మార్చడం, విదేశాల నుంచి సర్వర్లను ఆపరేట్ చేయడం వంటి తీవ్రమైన అంశాలను విచారణాధికారులు గుర్తించారు. ఇటీవల మీడియాలో వస్తున్న సత్యం స్కాం భూముల వ్యవహారం కూడా ఈ నివేదికలో కీలకంగా మారినట్లు తెలుస్తోంది. గతంలో వివాదాల్లో ఉండి, రిజిస్ట్రేషన్లకు వీలులేని భూములను ధరణిలోని మోడ్యూల్స్ మార్పుల ద్వారా బీఆర్ఎస్ పెద్దలకు అనుకూలంగా మార్చినట్లు ఆరోపణలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,848 ట్రాన్సాక్షన్లలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని నివేదికలో ప్రస్తావించినట్లుగా తెలుస్తోంది.ఈ నివేదికను ప్రభుత్వం పూర్తిస్థాయిలో బహిర్గతం చేస్తే, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అతిపెద్ద కుంభకోణాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఫోన్ ట్యాపింగ్ పేరుతో సీరియల్ ను నడుపుతున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు..తర్వాత ధరణి స్కాంలపై సీరియల్ నడిచే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో తెలంగాణలో పెద్ద ఎత్తున రాజకీయ దుమారాన్ని రేపడం ఖాయంగా కనిపిస్తోంది.

ఆడిట్ కు రెడీ అవుతున్న ప్రభుత్వం: ధరణి వ్యవస్థలో జరిగిన అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా మిగతా 31 జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. కేరళ కేంద్రంగా పనిచేసే సంస్థతో ఇప్పటికే.. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టింది తెలంగాణ ప్రభుత్వం. అయితే ఆ ఆడిట్ పూర్తైందని.. ఆ నివేదికను ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి చెప్పారు.కాగా, పేదలకు చెందిన ఇంచు భూమి కూడా అక్రమార్కులకు దక్కకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన సుమారు 5,500 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లు నిష్పక్షపాతంగా భూ సర్వేలు నిర్వహిస్తారని ఆయన చెప్పారు. కాగా, భూ భారతి స్కీమ్ కింద, రోవర్ టెక్నాలజీని ఉపయోగించి భూమి కొలతలు, సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. అందుకోసం సర్వేయర్లకు ఆధునికమైన రోవర్స్ సామగ్రి పంపిణీ చేస్తున్నామని మంత్రి చెప్పారు.నక్షా లేని 5 గ్రామాల్లో పైలట్ ఇప్పటికే సర్వే నిర్వహించామని, ఇందులో ఖమ్మం జిల్లాలోని ములుగుమాడు కూడా ఉందని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా నక్షాలులేని 413 గ్రామాల్లో మొదటి విడత సర్వే చేస్తామన్నారు. ఈ భూ సర్వేను విడతలవారీగా పూర్తిచేస్తామని.. భూముల మ్యాప్‌తో పాటు భూధార్ నంబర్లను అందించడంలో లైసెన్స్ సర్వేయర్లు ఉపయోగపడతారని మంత్రి పొంగులేటి తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించే అధికారం కలెక్టర్‌కు మాత్రమే పరిమితం చేయకుండా డీసెంట్రలైజ్ చేశామన్నా రు మంత్రి. ఇలా చేయడం వల్ల చాలా వరకు సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయని మంత్రి చెప్పారు. అయితే భూభారతి రిజిస్ట్రేషన్లలో భారీ కుంభకోణం జరిగిందనే ఆరోపణలను మంత్రి ఖండించారు. రూ. 1000 - రూ. 15000 కోట్ల స్కామ్ ఆరోపణలు అసత్యం అని చెప్పారు.ధరణి వ్యవస్థలో అవకతవకల కారణంగా రిజిస్ట్రేషన్ లో రూ. 3.90 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు గుర్తించామని మంత్రి పొంగులేటి చెప్పుకొచ్చారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి.. సొమ్ము రికవరీకి చర్యలు చేపట్టామని తెలిపారు.

## ఫ్యూచర్ భారత్..!

పాట్నా: భారతీయులు ఎవరినైనా ప్రేమిస్తే గుండెల్లో స్థానం ఇస్తారు. ఆ ప్రేమ పెరిగిపోతే గుడి కూడా కట్టేస్తారు. ఇప్పుడు యువభారత్లో సంచలన ఆటగాడు వైభవ్ సూర్య వంశీ కి అభిమానులు కచ్చితంగా గుడి కడతారు. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు..ఐపీఎల్ లో ఆడుతున్నప్పుడు రాజస్థాన్ జట్టు తరుపున సెంచరీ చేశాడు వైభవ్ సూర్య వంశీ. కేవలం 14 సంవత్సరాలు దాటని వయసులో అతడు ఆ ఘనత అందుకున్నాడు. ప్రపంచ స్థాయి మేటి బౌలర్లను ఓడించి సత్తా చూపించాడు. తద్వారా తను ఎంత ప్రమాదకరమైన ఆటగాడినో నిరూపించాడు.వైభవ్ సూర్య వంశి. అతడికి ఇంకా నూనూగు మీసాలు కూడా రాలేదు. తన తోటి పిల్లలు పాఠశాలల్లో పుస్తకాలతో కుస్తీ పడుతుంటే.. ఇతడేమో బ్యాట్ చేత పట్టుకొని ఆడుతున్నాడు. పాఠశాలలకు బదులుగా నెట్స్ లో తీవ్రంగా సాధన చేస్తున్నాడు. టోర్నీల పేరుతో దేశ విదేశాలు తిరుగుతున్నాడు. అతడు ఇప్పుడు ఏకంగా భారత జట్టుకు భవిష్యత్తు ఆశాకిరణం మాదిరిగా కనిపిస్తున్నాడు.ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో వైభవ్ సూర్య వంశీ 175 పరుగులు చేశాడు. టీం ఇండియాను విజేతగా నిలిపాడు. అయితే ఇంతటితోనే వైభవ్ సూర్య వంశీ ఆగిపోలేదు. అనేక రికార్డులను బద్దలు కొట్టాడు. ముఖ్యంగా పాకిస్తాన్ క్రికెటర్ బాబర్ ఆజామ్ సాధించిన ఘనతను జస్ట్ పక్కన పెట్టాడు. విధ్వంసానికి పరాకాష్టగా బ్యాటింగ్ చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు.వైభవ్ సూర్య వంశీ 175 పరుగులు చేయడం ద్వారా అనేక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అండర్ 19 వరల్డ్ కప్ ప్లే ఆఫ్ లో తొలిసారి 150+ పరుగులు చేసిన ఆటగాడిగా వైభవ్ సూర్య వంశీ నిలిచాడు. 2014లో దుబాయ్ లో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో ఆస్ట్రేలియాపై వెస్టిండీస్ ఆటగాడు నికోలస్ పూరన్ 143 పరుగులు చేశాడు. 2012లో జరిగిన ఫైనల్ మ్యాచ్లో ఆస్ట్రేలియా పై భారత ఆటగాడు ఉన్ముక్త్ 111× పరుగులు చేశాడు.2002 లో ఇంగ్లాండ్ జట్టుపై అంబటి రాయుడు 177× పరుగుల తర్వాత యూత్ వన్డేలో వైభవ్ సూర్య వంశీ చేసిన 175 పరుగులు.. సెకండ్ హైయెస్ట్ స్కోర్ గా కొనసాగుతున్నాయి. గత ఏడాది డిసెంబర్లో దుబాయ్ లోని యూఏఈ జట్టుపై సూర్యవంశీ 171 పరుగులు చేశాడు. తద్వారా ఈ జాబితాలో రెండు, మూడు స్థానాలలో అతడు కొనసాగుతున్నాడు..వైభవ్ సూర్య వంశీ వయసు ప్రస్తుతం 14 సంవత్సరాల 316 రోజులు. అండర్ ప్రపంచ కప్ లో ఫైనల్ మ్యాచ్లో సెంచరీ చేసిన అతి తక్కువ వయసున్న ఆటగాడు గతంలో ఈ రికార్డు పాకిస్తాన్ ఆటగాడు బాబర్ అజామ్ పేరు మీద ఉండేది. 2010లో వెస్టిండీస్ జట్టుపై 15 సంవత్సరాల 92 రోజుల్లో అతడి సెంచరీ చేశాడు.

## వెలిగొండ ప్రాజెక్ట్ క్రెడిట్ వార్

ఒంగోలు, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం 'క్రెడిట్ వార్' తారాస్థాయికి చేరింది. దశాబ్దాలుగా నలుగుతున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీల మధ్య మాటల యుద్ధానికి వేదికైంది. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు ప్రాంతాల తలరాతను మార్చే ఈ ప్రాజెక్టును తామే పూర్తి చేశామని ఒకరు.. కాదు తామే పునాది వేసి పరుగులు పెట్టిం చామని మరొకరు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు.వెలిగొండ ప్రాజెక్టుకు 1996లో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అయితే, 2004లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే ఈ ప్రాజెక్టుకు నిధుల ప్రవాహం పెరిగింది. జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టును ప్రాధాన్యత క్రమంలో చేర్చి, సుమారు రూ. 3,610 కోట్లను వెచ్చించారు. ప్రధాన కాలువలు, హెడ్ రెగ్యులేటర్ పనులను వైఎస్సార్ ప్రభుత్వం వేగవంతం చేసింది. ఆ తర్వాత 2014-19 మధ్య చంద్రబాబు టన్నెల్ బోరింగ్ మెషీన్లను రంగంలోకి దించి, అత్యంత క్లిష్టమైన మొదటి టన్నెల్ పనులను 90శాతం పూర్తి చేశారు. 2019-24 మధ్య జగన్ రెండో టన్నెల్ తవ్వకాన్ని పూర్తి చేసి, ఎన్నికలకు ముందు ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించాలని నిర్ణయించుకోవడంతో రాజకీయం రాజుకుంది. "మేము వేల కోట్లు ఖర్చు చేసి టన్నెల్ పనులను పూర్తి చేస్తే, ఇప్పుడు చంద్రబాబు వెళ్లి ఆ క్రెడిట్‌ను దొంగిలించాలని చూస్తున్నారు" అని వైసీపీ ఆరోపిస్తోంది. జగన్ హయాంలోనే ప్రాజెక్టు పూర్తయిందని వారు వాదిస్తున్నారు.అయితే, టీడీపీ ఈ వాదనను బలంగా తిప్పికొడుతోంది. కేవలం టన్నెల్ తవ్వకం పూర్తి చేస్తే ప్రాజెక్టు పూర్తి అయినట్లా అని ప్రశ్నిస్తోంది. ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి పునరావాసం పనులను జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎద్దేవా చేస్తోంది. ఇంకా 7,500 పైచిలుకు కుటుంబాలకు పరిహారం అందాల్సి ఉంది. కాలువల లైనింగ్, వంతెనల నిర్మాణం లాంటి కీలక పనులు పెండింగ్‌లో ఉండగానే జగన్ కేవలం ఓట్ల కోసం రిబ్బన్ కట్ చేశారని టీడీపీ మండిపడుతోంది. దాదాపు రూ. 9,000 కోట్ల మొత్తం ప్రాజెక్టు వ్యయంలో వైసీపీ చేసింది కేవలం రూ. వెయ్యి కోట్ల పనులేనని, మిగిలిన 80 శాతం శ్రమ ఇతర ప్రభుత్వాలదేనని వారు గణాంకాలు వివరిస్తున్నారు.ప్రస్తుతానికి వెలిగొండ ప్రాజెక్టులో రెండు టన్నెళ్ల తవ్వకం పూర్తయిన మాట వాస్తవం.

# కమిషనర్ల ఏర్పాటుకు కసరత్తు?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**అధికారికంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూడు మహా నగరపాలక సంస్థలుగా ఏర్పాటు కాలేదు గానీ పరిపాలన మాత్రం ఆ మేరకు మెల్లగా పట్టాలెక్కుతు న్నట్లు కనబడుతుంది. మూడు జోన్లకు ఓ అదనపు కమిషనర్ చొప్పున నియమించిన ఆ ఇద్దరు అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పరిపాలన బాధ్యతలపై స్పష్టమైన వివరాలను ఇచ్చారు. మీకు కేటాయించిన జోన్లకు సంబంధించిన పరిపాలన వ్యవహారాలను చక్కదిద్దుకోవాలని, జోనల్ కమిషనర్లతో పని చేయించుకోవడం మీ బాధ్యతే అని టెలీ కాన్ఫరెన్స్‌లో వారికి పలు రకాల సూచనలు చేశారు. కొనసాగింపుగా ఆయా జోన్ల పరిపాలన, ఆర్థిక, టౌన్ ప్లానింగ్ విభాగాలకు ఉన్నతాధికారులను సైతం నియమించారు. ప్రస్తుతం జీహెచ్ ఎంసీలో 12 జోన్లు, వాటి పరిధిలో 60 సర్కిళ్లు ఉన్నాయి.జీహెచ్ఎంసీ పరిధి శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, గోల్కొండ జోన్లకు పరిమితం కానుంది. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లతో గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీసీఎంసీ), మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లతో గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(జీఎంఎంసీ) ఏర్పాటవుతాయని తెలుస్తోంది. జీఎంఎంసీ పరిధి అదనపు కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జీసీఎంసీ పరిధికి ప్రస్తుత అదనపు కమిషనర్ సృజనని కమిషనర్లుగా నియమిస్తూ పాలకమండలి పూర్తయ్యాక ఉత్తర్వు వెలువడుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారంనూతన గ్రేటర్ కార్పొరేషన్ల టౌన్ ప్లానింగ్ వ్యవహారాల నిర్వహణను ఇద్దరు డైరెక్టర్ హోదాలో ఉన్న అధికారులకు అప్పగిస్తూ కమిషనర్ కర్ణన్



ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ఆయా జోన్ల పరిధిలోని నిర్మాణ అనుమతుల దరఖాస్తులు వారి ద్వారానే కమిషనర్ పర్మిషన్?కు వెళ్లనున్నాయి.విలీనంతో 300 డివిజన్ల పరిధిలోని నగరానికి 20శాతం మేర ఉద్యోగుల కొరత ఏర్పడింది. పారిశుద్ధ్య, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారులు లెక్కలను తేల్చారు. మరో 1,500 మంది అవసరమని, ఉన్నతాధికారులతో తక్షణమే కమిటీ వేయాలని నిర్ణయించారు.జీహెచ్?ఎంసీ పాలకమండలి గడువు వచ్చేతో ముగియనుంది. తర్వాత 300 డివిజన్లను మూడు భాగాలుగా చేసే ప్రక్రియ అధికారికంగా మొదలుకానుంది.

మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికలు ఉంటాయనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. జులై నాటికి నిర్వహించకపోతే 2027 వరకు జరిగే అవకాశం ఉండదని సంబంధిత అధికారులు పలు విశ్లేషణలు చేస్తున్నారు. జనగణన పూర్తవుతుందని, కొత్త జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేపట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు.

వంద, రెండు వందలు కాదు. ఏకంగా 4 వేలకుపైగా ఫిర్యాదులు జీహెచ్?ఎంసీ విస్తరణ సమస్యపై బుట్ట దాఖలయ్యాయి. డివిజన్లు పెంచండి, హద్దులు మార్చండంటూ రాజకీయ నేతలు, శివారు ప్రాంత ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను జీహెచ్ఎంసీ నిర్మొహమాటంగా తిరస్కరించడం పట్ల వారిలో ఆందోళన నెలకొంది. అందులో 90 శాతం అర్జీలు వేర్వేరు రాజకీయ పార్టీల నేతలవి కావడం గమనార్హం. ముందుగా నిర్ణయించుకున్నట్లుగానే డివిజన్ల పునర్విభజనను పూర్తి చేశారనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపస్తున్నాయి. జనాభా, విస్తీర్ణం దృష్ట్యా సమతూకం పాటించలేదని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలే కాకుండా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కూడా జీహెచ్?ఎంసీ విస్తరణను సవరించాలని కోరుతున్నారు.ఈ విస్తరణతో జీహెచ్ ఎంసీ పరిధితో సరిపడా భూలభ్యత, రవాణా, నివాసం, వర్షపు నీటి పారుదల, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సమగ్ర మెట్రోపాలిటన్ ప్రణాళికలు అమలు చేసే అవకాశం ఉంది. అలాగే కొత్తగా విలీనమైన ప్రాంతాలకు జీహెచ్ఎంసీ నిధులు, సాంకేతిక నైపుణ్యం, పారిశుధ్యం, దోమల నివారణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, అత్యవసర సేవలు వంటి ప్రామాణిక పౌర సేవలు మరింత మెరుగ్గా అందే అవకాశం ఉంది. ప్రపంచస్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే దిశగా ఈ ప్రక్రియ కీలక ఘట్టమని ప్రభుత్వం భావిస్తోంది.

# 'పెద్ది' మేనియా.. భారీ ఆఫర్లతో బయ్యర్ల క్యూ!



అందుతున్న సమాచారం ప్రకారం... 'పెద్ది' థియేట్రికల్ బిజినెస్ సుమారు రూ.300 కోట్ల మార్కును తాకే అవకాశం ఉందని తెలుస్తోం ది. ముఖ్యంగా నైజాం ఏరియాలో రూ. 65 కోట్ల వరకు బిజినెస్ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో భాగస్వామిగా ఉన్న మైత్రీ మూవీ మేకర్స్‌తో పాటు, అగ్ర నిర్మాతలు దిల్ రాజు, ఏషియన్ సునీల్ హక్కుల కోసం తీవ్రంగా ప్రయత్ని స్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ క్రేజ్ స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే కర్ణాటక హక్కులు 23 కోట్లు, ఓవర్సీస్ హక్కులు 40 కోట్లు చొప్పున అగ్రిమెంట్లు పూర్తయినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లో కూడా 'పెద్ది' బిజినెస్ లెక్కలు హాట్ టాపిక్‌గా మారాయి. సీడెడ్ ప్రాంతంలో 35 కోట్లు, కోస్టల్ ఆంధ్రలో సుమారు 85 కోట్ల వరకు ఈ చిత్రం బిజినెస్ చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ గణాంకాలు చూస్తుంటే రామ్ చరణ్ మాస్ పవర్ బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్‌లో ఉండబోతోందో అర్థమవుతోంది. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, సౌత్ ఇండియా మొత్తం ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. దీనికి తోడు మెగా ఫ్యాన్స్ సోషల్ మీడియాలో చేస్తున్న హడావిడి సినిమా హైప్‌ను మరింత పెంచు తోంది. నార్త్ ఇండియాలో ఇంకా అధికారికంగా డీల్స్ ప్రారంభం కాకపోయినప్పటికీ, హిందీ ట్రేడ్ సర్కిల్స్‌లో 'పెద్ది' పేరు మారు మోగిపోతోంది. ఈ చిత్రం 'పుష్ప' రేంజ్‌లో మ్యాజిక్ చేస్తుందని అక్కడి బయ్యర్లు బలంగా నమ్ముతున్నారు.

ఆ నమ్మకంతోనే భారీ ధరలకు హక్కులను దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇక థియేట్రికల్ ఆదాయమే కాకుండా డిజిటల్, ఓటిటి, శాటిలైట్, ఆడియో హక్కుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, నిర్మాత ఇప్పటికే టేబుల్ ప్రాఫిట్‌లో ఉన్నారని అందరికీ స్పష్టమవుతోంది. ఈ నెలలో రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు ఒక పవర్‌ఫుల్ ట్రైలర్‌ను విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నారు. ఈ ట్రైలర్ గనుక ప్రేక్షకులను మెప్పిస్తే, ఇప్పుడు జరుగుతున్న బిజినెస్ చర్చలకు మరింత బలం చేకూరుతుంది. ప్రస్తుతం ఐటెం సాంగ్ చిత్రీకరణతో పాటు కొన్ని ప్యాచ్ వర్క్ పనులు మిగిలి ఉన్నప్పటికీ, విడుదల తేదీలో ఎలాంటి మార్పు ఉండదని చిత్ర యూనిట్ స్పష్టం చేస్తోంది. ఏప్రిల్ 30న 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయడం ఖాయమని, ఇది ట్రేడ్ పరంగా సరికొత్త చరిత్ర సృష్టిస్తుందని పరిశ్రమ వర్గాలు బలంగా విశ్వసిస్తున్నాయి.

# మార్చి 27న రానున్న ప్రియదర్శి 'సుయోధన'




తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనతో అలరిస్తున్న యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సుయోధన'. ఈ సినిమాకు సంబంధించి తాజాగా మేకర్స్ ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ ప్రస్తుతం సినీ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. ప్రజ్వల లైన్ క్రియేషన్స్ బ్యానర్‌పై బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి, వై.ఎస్. మాధవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రియదర్శి సరసన ద్రిషిక చందర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా 'డైలాగ్ కింగ్' సాయికుమార్ మరియు సీనియర్ నటి ప్రేమ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ సందర్భం గా నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ, "ఒక మంచి కథ, కథనాలతో అత్యుత్తమ నిర్మాణ విలువలతో 'సుయోధన' చిత్రాన్ని రూపొందించాము. ప్రియదర్శి, సాయికుమార్ నటన సినిమాకు ప్రాణంపోశాయి. సంగీత దర్శకుడుజై క్రిష్‌అందించిన స్వరాలు, రామ జోగయ్య శాస్త్రి గారి సాహిత్యం ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యాము.


# వృషకర్మ కోసం నాగచైతన్య కసరత్తులు




యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం హీరోగా తెరకెక్కుతున్న ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం వృషకర్మపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటిస్తుండగా, టాలెంటెడ్ దర్శకుడుకార్తీక్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వృష కర్మ' గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందని మేకర్స్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సినిమాలో నాగ చైతన్య పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిం చబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. తాజాగా నాగ చైతన్య సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. ఆయన జిమ్‌లో తీసుకున్న ఒక ఫోటోను పోస్ట్ చేశాడు. ఆ ఫోటోలో చైతు 6 ప్యాక్ బాడీతో స్టైలిష్‌గా కనిపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. డంబెల్స్ పట్టుకుని వర్కౌట్ చేస్తున్న ఫోటో ద్వారా ఈ సినిమా కోసం ఎంత కష్టపడుతున్నాడో చూపించాడు. ఇటీవల వచ్చిన తండేల్ సినిమాలో నాగ చైతన్య డీ-గ్లామరస్ లుక్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. అయితే 'వృష కర్మ' కోసం మాత్రం పూర్తిగా స్టైలిష్ మరియు ఫిట్ లుక్‌లోకి మారడం విశేషంగా మారింది. నాగ చైతన్య ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. హీరో సుశాంత్ వంటి సెలబ్రిటీలు కూడా ఈ పోస్ట్‌పై స్పందించగా, వేలాది మంది అభిమానులు ర్ ఎమోజీలు, లైక్స్‌తో కామెంట్స్ సెక్షన్‌ను హోరెత్తించారు. ఇదిలా ఉండగా నాగ చైతన్య సెట్స్‌కి సంబంధించిన మరికొన్ని ఫోటోలు కూడా షేర్ చేశారు. షూటింగ్ లొకేషన్స్‌లో తీసిన ఈ చిత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వృష కర్మ' సినిమాపై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది.





# ప్రభాస్ స్పిరిట్ కోసం అభిమానుల ఎదురుచూపు




రాజాసాబ్ డిజాస్టర్‌తో ఇప్పుడు ప్రభాస్ అభిమానులు ఆయన తదుపరి సినిమా స్పిరిట్ కోసం తెగ ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ నటిస్తున్న భారీ ప్రాజెక్ట్‌లలో ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా స్పిరిట్ అభిమానుల అంచనాలకు తగ్గట్లుగా రూపొందించడంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రయత్నిస్తున్నారు. ఈ చిత్రం ఒక పవర్‌ఫుల్ కాప్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి తృప్తి దిమ్రి నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ప్రస్తుత షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ జరుగుతుండగా, అది పూర్తయ్యిన వెంటనే ఒక గ్రాండ్ సాంగ్‌ను షూట్ చేయాలని చిత్రబృందం ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఈ సాంగ్‌లో ప్రభాస్ మాస్ స్టెప్స్‌తో పాటు తృప్తి దిమ్రి గ్లామర్ కూడా హైలైట్‌గా ఉండనుందని చెబుతున్నారు. భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో ఈ పాటను తెరకెక్కించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక 'స్పిరిట్' సినిమా మొత్తంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో ప్రభాస్ ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా ప్రభాస్ లుక్ పూర్తిగా వైల్డ్ అండ్ మాస్ అవతార్‌లో ఉండటంతో అభిమానుల్లో ఈ సినిమాపై హైప్ మరింత పెరిగింది. కథలోని ఎమోషన్, యాక్షన్‌కు తగ్గట్టుగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రత్యేకంగా ఉండబోతుందని సమాచారం. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను టి-సిరీస్‌తో పాటు భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కథ విషయానికి వస్తే, 'స్పిరిట్' మెయిన్ కాన్సెప్ట్ పూర్తిగా కొత్తగా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన స్టైల్‌కు తగ్గట్టుగా రియలిస్టిక్ యాక్షన్‌తో పాటు గట్టి ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఈ సినిమాలో చూపించనున్నారని టాక్ వినిపిస్తోంది.

# కీరవాణి కొడుకుతో బలగం హీరోయిన్ ప్రేమ..!



తెలుగు సినీ పరిశ్రమలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న కావ్య కళ్యాణ్ రామ్ ఆ తర్వాత హీరోయిన్‌గా మారి తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకుంది. చిన్నప్పుడే పలు సినిమాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, పెద్దయ్యాక హీరోయిన్‌గా కూడా వరుస అవకాశాలు అందుకుంటోంది. హీరోయిన్‌గా ఆమె చేసిన మసూద,బలగం, ఉస్తాద్ వంటి సినిమాలు మంచి గుర్తింపు తెచ్చి పెట్టాయి. ముఖ్యంగా 'బలగం' సినిమా భారీ విజయాన్ని సాధించడంతో కావ్యకు మరింత క్రేజ్ వచ్చింది. ప్రస్తుతం కూడా ఆమె పలు కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా కావ్య చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ తన ఫోటోలు, వీడియోలు పంచుకుంటూ అభిమానులతో టచ్‌లో ఉంటోంది. ఆమె పోస్ట్ చేసే ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం కావ్య కళ్యాణ్ రామ్ పెళ్లి గురించి టాలీవుడ్‌లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి పెద్ద కుమారుడు, గాయకుడు ,సంగీత దర్శకుడు కాళ భైరవతో కావ్య ప్రేమలో ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. కాల భైరవ మొదట గాయకుడిగా తన కెరీర్‌ను ప్రారంభించి మంచి గుర్తింపు సంపాదించాడు. తర్వాత సంగీత దర్శకుడిగా కూడా తన ప్రతిభను చూపిస్తూ వరుసగా సినిమాలకు సంగీతం అందిస్తున్నాడు. తన ప్రత్యేక శైలితో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ టాలీవుడ్‌లో మంచి స్థానం సంపాదించుకుంటున్నాడు. ఇక గత కొన్నేళ్లుగా కాల భైరవ మరియు కావ్య కళ్యాణ్ రామ్ మధ్య స్నేహం ప్రేమగా మారిందని టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. వీరిద్దరూ చాలా కాలంగా డేటింగ్ చేస్తున్నారని, ఇప్పటికే ఇరు కుటుంబాలు కూడా వారి ప్రేమను అంగీకరించాయని వార్తలు వస్తున్నాయి. ఇక ఈ ఏడాదిలోనే వీరి పెళ్లి జరిగే అవకాశం ఉందనికూడా సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కీరవాణి కుటుంబంలో మరో పెళ్లికూడా జరిగింది. ఆయన చిన్న కుమారుడు సింహా కోడూరి ప్రముఖ నటుడు మురళి మోహన్ మనవరాలిని వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు పెద్ద కుమారుడు కాల భైరవ పెళ్లి కూడా జరగబోతుందన్న వార్తలు వినిపిస్తుండటంతో ఈ విషయం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఇప్పటివరకు ఈ వార్తలపై కావ్య కళ్యాణ్ రామ్ లేదా కాల భైరవ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో వీరి ప్రేమ, పెళ్లి వార్తలు నిజమా కాదా అన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

## స్పీడ్‌గా ఎన్టీఆర్ డ్రాగన్ షూటింగ్

ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఇటీవల జోర్డాన్‌లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్, ఇప్పుడు తదుపరి యాక్షన్ వేట కోసం సిద్ధమైంది. జోర్డాన్ షెడ్యూల్‌లో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించాడు ప్రశాంత్ నీల్. ఇక ఇప్పుడు నెక్స్ట్ షెడ్యూల్‌లో కూడా భారీ యాక్షన్ ఉండబోతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం.

ఇందుకోసం నగర శివార్లలోని ఒక ప్రముఖ స్టూడియోలో మూడు భారీ సెట్లను నిర్మించారట. ఇందులో విలన్ ఇంటికి సంబంధించిన సెట్ కూడా ఉందట. దాదాపు నెల రోజులకు పైగా సాగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో.. సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఇక ఇక్కడ షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ తదుపరి షెడ్యూల్ కోసం శ్రీలంక వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అక్కడ కూడా యాక్షనే ఉంటుందని టాక్. మొత్తంగా చూసుకుంటే.. డ్రాగన్ యాక్షన్ షెడ్యూల్సే ఎక్కువగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రశాంత్ నీల్ ఏ రేంజ్ యాక్షన్ డోస్ ఇవ్వబోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ మరియు మలయాళ నటుడు టోవినో థామస్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. 'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో.. డ్రాగన్ పై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215